www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి | భద్రాద్రి
శుక్రవారం | 25 | సెప్టెంబర్ | 2026 | పేజీలు : 8

## పేదలందరికీ గూడు కల్పించడమే లక్ష్యం



- పారదర్శకంగానే ఇండ్ల ఎంపిక ప్రక్రియ
- లాటరీ ద్వారా 578 మందికి గృహాలు
- అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తాం
- ఎంఎల్‌ఏ కూనంనేని


ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : పేదలందరికీ గూడు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతన్నామని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం కార్పోరేషన్ పరిధిలోని 60 డివిజన్ల పరిధిలో ఇండ్లులేని నిరుపేదలకు లాటరీ పద్ధతిలో డబుల్ బెడ్రూమ్ ఇళ్లు మిగతా 2లో..

# కలెక్టర్ సాబ్ జర దేకో..!

## సదరం ధృవీకరణలో అక్రమాలు

- అసలు వైకల్యం లేని వారికి పుట్టుకతోనే వైకల్యమని ధృవీకరణ
- ప్రతి నెల కోట్ల ప్రజా ధనం పక్కదారి
- వసూళ్ల రాణిని వదిలేసినట్లేనా





Physical(Locomotor/Orthopaedic) Disability.
The disability is in relation to his : Left Lower Limb. Impaired reach
Sub-type of disability :Muscular Weakness.

Cause of Disability : Congenital.
Re-assessment of this case is recommended after a period of 5 ye
Percentage of disability in his case is 45% [Fourty Five percent].
He meets the following physical requirements for discharge of his
by manipulating with fingers,PP-can perform work by pulling and
by lifting,KC-can perform work by kneeling and crouching,B-can p
can perform work by sitting.
Identification Marks of Person with Disability:-

nature | Signature | Sig
T.Madan Singh | Dr. B.Amar Singh | Dr. De

ప్రజాపక్షం/ ఖమ్మం : ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి కేంద్రంగా పలు అక్రమాలు చోటుచేసుకున్నాయి. అసలు వైకల్యమేలేని వారికి 45 శాతం వైకల్యం ఉన్నట్లు అది కూడా పుట్టుకతో వచ్చిందని వైద్యులు ధృవీకరిస్తున్నారు. యుక్త వయస్సు నుంచి ఇప్పటి వరకు వ్యవసాయ పనులు చేసుకుంటూ ఎటువంటి ఇబ్బందులు లేని వారికి వైకల్యాన్ని అంటగట్టిన వైద్యుల పట్ల ఉన్నతాధికారులు ఉదాసీనంగా వ్యవహరించడం సదరం ధృవీకరణలో అనేక అక్రమాలు వెలుగుచూస్తున్న కనీస చర్యలు తీసుకోక పోవడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. పలువురి వికలాంగ ధృవీకరణకు సంబంధించి ఫిర్యాదులు రావడంతో పాటు మీడియాలో ఆధారాలతో వార్తలు వచ్చినా అధికారులు కనీస చర్యలు మిగతా 2లో..

## సుప్రీం తీర్పుతో ఝలక్






- భద్రాచలం ఉప ఎన్నికపైన చర్చ
- బిఆర్‌ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన వెంకట్రావు

2లో..

## టర్నడో బీభత్సం

- కొనసాగుతున్న అల్పపీడన ద్రోణి
- పొంగిపొర్లుతున్న వాగులు వంకలు
- రైతుల్లో ఆనందం, ఆందోళన
- కొత్తగూడెం నియోజకవర్గంలో కూనంనేని పరామర్శ

2లో..



## విద్యుత్ వ్యవస్థను నిర్వీర్యం చేసిన కాంగ్రెస్ : బిఆర్‌ఎస్

- విద్యుత్ కేంద్రాల వద్ద ఆందోళన
- పాల్గొన్న పువ్వాడ అజయ్, వద్దిరాజు తదితరులు



ప్రజాపక్షం/మణుగూరు/ పాల్వంచ : కాంగ్రెస్ పార్టీ విద్యుత్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ రైతులు, ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఆరోపించారు. థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరా చేయకపోవడం వల్లనే థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ నిలిచిపోతుందని వారు ఆరోపించారు. బిఆర్‌ఎస్ రాష్ట సమితి పిలుపులో భాగంగా కొత్తగూడెం, మణుగూరు థర్మల్ విద్యుత్ కేంద్రాలను బిఆర్‌ఎస్‌నాయకులు సందర్శించారు. అజయ్‌కుమార్ నేతృత్వంలో బిటిపిఎస్ వద్ద ఆందోళన నిర్వహించగా రవిచంద్ర నాయకత్వంలో పాల్వంచలోని కెటిపిఎస్ ఎదుట ఆందోళన నిర్వహించారు. పాల్వంచ, మణుగూరులలో థర్మల్ విద్యుత్ కేంద్రాల వద్ద మిగతా 2లో..

# కలెక్టర్ సాబ్ జర దేకో..!

**(మొదటిపేజీ తరువాయి)** తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది. అక్రమ పద్ధతుల్లో పింఛన్ పొందడంతో ప్రతి నెల కోట్లాది రూపాయల ప్రజాధనం పక్కదారి పడుతుంది. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో సదరం క్యాంపుల్లో వైద్యులు అసలు వైకల్యం లేని వారికి 45 శాతం నుంచి 65 శాతం వైకల్యం ఉందని ఎలా ధృవీకరించారన్న దానిపై విచారణ సాగడం లేదు. వైద్యులు యథేచ్ఛగా వైకల్యం లేని వారికి వైకల్యం ఉన్నట్లు ధృవీకరణ ఇవ్వడంతో జిల్లాలో ఒక పైరవీకారుల వ్యవస్థ రూపుదిద్దుకుంది.

### గ్రామాల్లో పైరవీకారుల జోరు :

ప్రభుత్వ వైద్యులు సదరం క్యాంపుల్లో లంచాలు పుచ్చుకుని అంగవైకల్యం ఉన్నట్లు ధృవీకరిస్తుండడంతో గ్రామాల్లో పైరవీకారుల జోరు మొదలైంది. అక్రమ పద్ధతుల్లో పింఛన్ ఆశించే వారి నుంచి రూ. 30వేల నుంచి రూ.50వేల చొప్పున వసూలు చేసి సదరం క్యాంపుల్లో పాల్గొన్న వైద్యులకు కొంత ముట్టజెప్పి అక్రమ పద్ధతుల్లో సదరం ధృవీకరణను ఇప్పించడం ప్రారంభమైంది. వైరా మండలం రెబ్బవరం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తొలుత ఈ అక్రమ పింఛన్ పొందే పద్ధతికి శ్రీకారం చుట్టాడు. వైరాలోని ఓ ఫోటో స్టూడియోలో వైకల్యం ఉన్నట్లుగా ఫోటోలు తీయించి సదరం ధృవీకరణ ద్వారా పింఛన్ ఇప్పించాడు. అలా మొదలైన ఈ వ్యవస్థ ఇప్పుడు చాలా గ్రామాల్లో లక్షలాది రూపాయలు వసూలు చేసి వైద్యులకు, జిల్లా కేంద్ర ఆసుపత్రిలో ఉన్న కొందరు ఉద్యోగులకు ముట్టజెప్పారు. ఇప్పుడు జిల్లాలో వైకల్యం లేకుండా పింఛన్ పొందుతున్న వారి సంఖ్య వేలల్లో ఉండగా పైరవీకారులు ప్రజల నుంచి వసూలు చేసి సదరం ధృవీకరణలు ఇప్పించాల్సిన వారి సంఖ్య కూడా వేలల్లో ఉంటుంది. కొందరు పైరవీకారులు ఇప్పటికే వసూలు చేసిన డబ్బులకు సంబంధించి ప్రాంసరీ నోట్లు కూడా రాసిఇచ్చారు. ప్రభుత్వం వికలాంగులకు రూ. 4వేలు ప్రతి నెల పింఛన్ ఇస్తుండడంతో సదరం ధృవీకరణలకు ఇంత డిమాండ్ ఏర్పడింది. అసలు వైకల్యమే లేని వారికి పుట్టుకతోనే వైకల్యం ఉందని 50 నుంచి 60 ఏళ్లు దాటిన వ్యక్తులకు ఇప్పుడు ధృవీకరణ అందజేయడం కూడా ఆలోచించాల్సిన విషయమే. సదరం క్యాంపుల్లో ప్రైవేటు వ్యక్తులు కూర్చుని వైకల్య శాతాన్ని వారి ఇష్టం వచ్చినట్లు వైద్యుల చేత వేయించుకున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి.

### తప్పుడు ధృవీకరణతో ఇప్పుడు దరఖాస్తులు :

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నూతన పింఛన్లకు సంబంధించి దరఖాస్తులను ఆహ్వానించడంతో పైరవీకారుల అండతో అక్రమ పద్ధతుల్లో లేని వైకల్యాన్ని ధృవీకరిస్తూ పొందిన ధృవపత్రాలతో వికలాంగ పింఛన్ కొరకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తుల విచారణకు వెళ్లిన అధికారులు సైతం స్థానిక పైరవీకారులతో జట్టుకట్టి ఎటువంటి విచారణ లేకుండానే పింఛన్‌కు సిఫారసు చేస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఖమ్మం



జిల్లాలో పలు మండలాల్లో ఇప్పుడు ఈ బోగస్ ధృవీకరణతో వచ్చిన దరఖాస్తులు వెలుగు చూస్తున్నాయి. విచారణ అధికారులపైన తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### వసూళ్ల రాణిని వదిలేశారా :

తాను ప్రభుత్వ ఉద్యోగి కాకపోయినా సదరం క్యాంపుల్లో కూర్చుని ఈ జిల్లాలో వేలాది మంది వద్ద వికలాంగ ధృవీకరణ కోసం డబ్బులు వసూలు చేసిన వసూళ్ల రాణిని వదిలేశారా అన్న చర్చ సాగుతుంది. అసలు ఆమె సదరం క్యాంపులలోకి ఎలా వచ్చింది...? ఆమె చెబితే వైకల్యం లేని వారికి వైకల్యం ఉన్నట్లు ఎలా ధృవీకరించారు...? ఆమె వసూలు చేసిన డబ్బుల్లో ఏ వైద్యునికి ఎంత ఇచ్చింది...? అన్న దానిపై కనీస విచారణ లేదు. ప్రాథమిక అంచనా ప్రకారం జిల్లా వ్యాప్తంగా వికలాంగ పింఛన్లు, ఒంటరి మహిళలకు సంబంధించిన ధృవీకరణ, ఉద్యోగాలు ఇప్పిస్తానన్న పేరుతో రెండు కోట్లు వసూలు చేసినట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. డబ్బులు ఇచ్చిన వారు ఎవరైనా ప్రశ్నిస్తే ఒక లాయర్ ద్వారా నోటీసులు ఇప్పిస్తూ కులం పేరుతో బెదిరిస్తుందని బాధితులు వాపోతున్నారు. ఇప్పుడు జిల్లాలో అక్రమంగా వికలాంగ పింఛన్ పొందుతున్న వారిలో ఈ వసూళ్ల రాణితో పాటు రెబ్బవరం పైరవీకారిదే అగ్రస్థానమని సమాచారం. ప్రభుత్వ, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి కానీ వ్యక్తి సదరం క్యాంపుల్లో చక్రం తిప్పడం పైన ఆమెకు ఉన్న వైద్యుల సహకారం పైన విచారణ జరగాలని కోరుతున్నారు.

### విచారణ - చర్యలు :

గడిచిన నాలుగైదు సంవత్సరాలుగా ఎటువంటి వైకల్యం లేకుండానే పింఛన్ పొందుతుండటంపై పూర్తి స్థాయి విచారణ జరపాల్సి ఉంది. అక్రమ పద్ధతుల్లో పింఛన్ పొందుతున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు వారు ఇప్పటి వరకు పొందిన పింఛన్ మొత్తాన్ని రికవరీ చేస్తే తప్ప ఈ అక్రమ పద్ధతికి తెరపడే అవకాశం లేదు. వైకల్యం లేకుండానే ఇప్పుడు పింఛన్ కోసం దరఖాస్తు పెట్టిన వారిని అధికారులు విచారిస్తే తీగ లాగితే డొంక కదిలినట్లు మొత్తం అక్రమ విషయాలు వెలుగుచూసే అవకాశం ఉంది. ధృవీకరణలో 40 శాతానికి పైబడిన వాస్తవంగా వైకల్యం లేదని దరఖాస్తులు తిరస్కరించడంతో పాటు అటువంటి వ్యక్తులపైన కేసులు నమోదు చేయాల్సి ఉంది. ఖమ్మం కేంద్రంగా జరిగిన సదరం ధృవీకరణ అక్రమాల్లో పాలు పంచుకున్న వైద్యులు, సిబ్బంది తదితరులపై చర్యలు తీసుకోవాలని దీనిపై సమగ్ర విచారణ జరపాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

# పేదలందరికీ గూడు కల్పించడమే లక్ష్యం



**(మొదటిపేజీ తరువాయి)** కేటాయించే ప్రక్రియ గురువారం పాల్వంచ, కొత్తగూడెంలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంఎల్‌ఏ మాట్లాడుతూ జి2 నిర్మాణ విధానంలో గతంలో కొందరిని లాటరీ పద్దతిలో ఎంపిక జరిగిందని గుర్తు చేశారు. ఇప్పుడు అర్హులైన వారందరికీ పారదర్శకంగా ప్రజా స్వామ్య పద్దతిలో లాటరీతీసి ప్రారంభించినట్లు తెలిపారు. ఈ లాటరీ విధానంలో సామాజిక న్యాయానికి పెద్దపీఠ వేశామని, మరికొన్ని ఓపెన్ కేటగిరీలో లబ్దిదారులకు అందించామన్నారు. గూడులేని నిరుపేదల కుటుంబాల వారికి అండగా నిలవడమే బాధ్యతగా పనిచేస్తున్నామని, లాటరీలో ఇండ్లు రానివారికి ఇందరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి పేద కుటుంబానికి ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, డిప్యుటి మేయర్ సిరిపురపు లలితకుమారి ప్రజాప్రతినిధులు వీరబాబు, కొత్వాల శ్రీనివాస్‌రావు, మండే వీరహన్మంతరావు కమీషనర్ సుజాత, డిప్యుటీ కమీషనర్ విజాయనంద్, తహశిల్దార్ ప్రసాద్, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# సుప్రీం తీర్పుతో ఝులక్

**ప్రజాపక్షం/ఖమ్మం :** సుప్రీం కోర్టు తీర్పు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. పార్టీ ఫిరాయింపుల అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ఖైరతాబాద్ నుంచి బిఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగా శాసనసభకు ఎన్నికై ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరి సికింద్రాబాద్ ఎంపిగా పోటీ చేసిన దానం నాగేందర్‌ను పార్టీ ఫిరాయింపు చట్టం క్రింద రాష్ట్ర హైకోర్టు అనర్హుడిగా ప్రకటించగా గురువారం సుప్రీం కోర్టు హైకోర్టు తీర్పుతో ఏకీభవిస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది. దీనితో ఇప్పుడు ఖైరతాబాద్‌కు ఉపఎన్నిక అనివార్యమైంది. దానం నాగేందర్‌తో పాటు మరి కొంత మంది శాసన సభ్యులు బిఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలంకు చెందిన తెల్లం వెంకట్రావు బిఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి కారు గుర్తుపై గెలిచారు. గెలిచిన కొద్ది రోజులకే ఆయన కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఇందుకు సంబంధించి తెల్లం వెంకట్రావును అనర్హుడిగా ప్రకటించాలని బిఆర్‌ఎస్ గడిచిన కొంత కాలంగా ప్రయత్నం చేస్తుంది. కాంగ్రెస్‌లో చేరలేదని, కాంగ్రెస్ కండువాలు కప్పుకోలేదంటూ స్పీకర్‌కు వివరణలు అందించారు. కాంగ్రెస్‌లో చేరినట్లు పలు ఆధారాలను బిఆర్‌ఎస్ స్పీకర్‌తో పాటు న్యాయస్థానానికి సమర్పించింది. మొత్తంగా దానం నాగేందర్ పట్ల వ్యవహరించిన వైఖరినే పార్టీ మారిన మిగిలిన ఎంఎల్‌ఎల పట్ల బిఆర్‌ఎస్ వ్యవహరించనుంది.

# విద్యుత్ వ్యవస్థను నిర్వీర్యం చేసిన కాంగ్రెస్ : బిఆర్‌ఎస్







**(మొదటిపేజీ తరువాయి)** ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. పోలీసులకు, బిఆర్‌ఎస్ నాయకులకు మధ్య తోపులాట జరిగింది. పాల్వంచలో బిఆర్‌ఎస్ నాయకులను లోపలికి అనుమతించ లేదు. ఈ సందర్భంగా మణుగూరులో నిరసనకారులను ఉద్దేశించి అజయ్‌కుమార్ మాట్లాడుతూ కేసిఆర్ నాయకత్వంలో రైతులకు, గృహ వినియోగదారులకు, పరిశ్రమలకు 24 గంటల పాటు నిరంతరాయంగా విద్యుత్‌ను అందిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఎనిమిది గంటలు మాత్రమే అందిస్తుందని అది విడతల వారీగా అందిస్తుందని ఆయన ఆరోపించారు. వినియోగం పెరిగినప్పుడు ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోతున్నాయని అజయ్‌కుమార్ ఆరోపించారు. థర్మల్ విద్యుత్ కేంద్రాలకు నాణ్యమైన బొగ్గు సరఫరా కావాలంటే జెన్‌కో బాకీ మొత్తాన్ని వెంటనే సింగరేణికి చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. పాల్వంచలో జరిగిన ఆందోళనను ఉద్దేశించి వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా విద్యుత్ ఉత్పత్తిని తగ్గిస్తూ రైతులను ఇబ్బందులు పెడుతుందన్నారు. కేసిఆర్ రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తిని పెంచి కోతలు లేకుండా నిలువరించారని ఆయన తెలిపారు. బొగ్గు స్కామ్‌కు కాంగ్రెస్ తెరలేపిందని ఇప్పుడు దాని ప్రభావం విద్యుత్ ఉత్పత్తిపై పడిందన్నారు. తక్షణం బకాయిలు చెల్లించి విద్యుత్ ఉత్పత్తిని పునరుద్దరించి రాష్ట్రంలో కోతలు లేకుండా నివారించాలని రవిచంద్ర డిమాండ్ చేశారు.మణుగూరులో జరిగిన ఆందోళనలో మాజీ శాసన సభ్యులు రేగా కాంతారావు, బిఆర్‌ఎస్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, కట్టా కృష్ణార్జున్‌రావు, నర్సింహారావు, తదితరులు పాల్గొనగా పాల్వంచలో మాజీ శాసన సభ్యులు వనమా వెంకటేశ్వరరావు, మెచ్చా నాగేశ్వరరావు, దిండిగల రాజేందర్, రాజు గౌడ్, కార్పొరేటర్లు మధుచంద్, గుణచరిత్, కాపు సీతాలక్ష్మి , మల్లెల రవిచంద్ర పాల్గొన్నారు.

# టర్నడో బీభత్సం

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** అల్పపీడన ద్రోణి కారణంగా టర్నడో బీభత్సాన్ని సృష్టిస్తోంది. భద్రాద్రి జిల్లాలో వర్షాలు కుండపోతగా పడుతుండగా ఈదురు గాలులు తోడయ్యాయి. దీంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. వర్షాల ధాటికి వాగులు వంకలు పొంగిపొర్లుతుండటంతో పాటు చెరువులు కుంటల్లోకి భారీగా వర్షపు నీరు వచ్చి చేరుతోంది. లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారుతున్నాయి. వర్షంతో పాటు ఈదురు గాలుల బీభత్సానికి బూర్గంపాడు మండలం మోరంపబల్లి బంజర్ ప్రాంతం పూర్తిగా దెబ్బతిన్నది. ఆ ప్రాంతాలోని దుకాణాలపై ఉన్న రేకు కప్పులతో పాటు సమీప ఇళ్లలోని పలు సామాన్లు ఈదురు గాలిలో చెల్లా చెదురయ్యాయి. అశ్వారావుపేట నియోజకవర్గ పరిధిలోని దమ్మపేట మండలంలో ఈదురు గాలులకు పలు చెట్లు నేలకొరిగాయి, పామాయిలు చెట్లు సైతం వేళ్లతో సహా ప్రక్కకు ఒరిగాయి. పలెల్లో గొడ్ల చావడ్లు, రేకుల ఇళ్ల పై కప్పులు గాలి ధాటికి లేచిపోయాయి. వర్షాల కారణంగా విద్యా సంస్థలకు మరో రోజు సెలువులు ప్రకటించినప్పటికీ రాగల 48 గం.ల పాటు ఈదురు గాలులతో కూడిన వర్ష ప్రభావం ఉండనుండటంతో సెలవులు పొడిగించే అవకాశం ఉంది.

### జలకళ..

కొండలు అటవీ ప్రాంతాల నుండి వరదనీరు దిగువకు చేరుతుండటంతో జిల్లాలోని పలువాగులు వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో కురుస్తున్న వర్షానికి తెలంగాణాలోని తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టులోకి వర్షపునీరు వచ్చి చేరుతోంది. కిన్నెరసాని నిండుకుండలా మారుతోంది. పెద్దవాగు ప్రాజెక్టు జలకళను సంతరించుకుంది. నీటి ఉధృతి కారణంగాప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. దుమ్ముగూడెం మండల పరిధిలోని గుబ్బలమంగి వాగు పెద్ద ఎత్తున పారుతోంది. మరోప్రక్క వాగులు వంకలు పొంగటంతో నీరు రోడ్లపైకి చేరుతోంది. లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపు నీరు చేరుతోంది. ఈదురు గాలులతో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. విద్యుత్ స్తంబాలు, విద్యుత్ తీగలకు అక్కడక్కడ దెబ్బతింటున్నాయి. చెట్లు నేలకొరుగుతున్నాయి. పాత భవనాలకు దూరంగా



ఉండాలని అధికారులు ఇప్పటికే సూచిస్తున్నారు.

### రైతుల్లో ఆనందం ఆందోళన..

వర్షాలు సాగుకు కొంత ఊరటనిస్తున్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో అధిక వర్షపాతం రైతుల్లో ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే సాగులో ఉన్న పంట పొలాల్లో నీరి నిలిచిపోవడంతో పంటలపై ప్రభావం పడే అవకాశం ఉంది. మరోవైపు చెరువులు కుంటలు నిండుతుండటంతో రానున్న రోజుల్లో సాగునీటికి ప్రయోజనంగా మారుతుందని రైతులు ఆశిస్తున్నారు.

### అధికార యంత్రాంగం అప్రమత్తం..

జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాల్సి అవసరం ఏర్పడింది. వర్షాకారణంగా ఏర్పడే విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఇప్పటికే జిల్లా అధికార యంత్రాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం చేసింది. వర్షాల తీవ్రత దృష్ట్యా అవసరమైతేనే తప్ప బయటకు రావద్దని హెచ్చరిస్తున్నారు. ప్రధానంగా పిల్లలు వృద్ధులు ఈదురు గాలులతో అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ప్రజలెవ్వరూ నీటి ప్రవాహాల వైపు వెళ్లరాదని అధికారులు హెచ్చరిస్తున్నారు.

### కూనంనేని పరామర్శ..

టర్నడో కారణంగా కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని పాల్వంచ మండలంలోని దంతెలబోర, బంద్రుగొండ, పరిసర గ్రామాల్లో పలు ప్రాంతాలు దెబ్బతినగా ఆ ప్రాంతాలను ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు గురువారం సందర్శించారు ఈ సందర్భంగా ఆ ప్రాంత వాసులకు, రైతులకు ధైర్యం చెప్పారు. ప్రకృతి విపత్తుల కారణంగా దెబ్బతిన్న పంటలు, ఇళ్లకు ప్రభుత్వం నుండి నష్టపరిహారం అందేలా కృషి చేయనున్నట్లు చెప్పారు.

# సర్ మంటుంది..!




**- ఓటు హక్కు కోసం ప్రజల పాట్లు**
**- 23వేల నోటీసులతో పెరిగిన ఇబ్బందులు**
**- వృద్ధులది ఓ గోస..ఓసీలది మరో సమస్య**

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** అర్హులైన పౌరులందరికి ఓటు హక్కు ఉండేలా..అనర్హుల పేర్లు ఓటర్ల జాబితాలో లేకుండా చూడాలనే లక్ష్యంతో ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) ప్రక్రియ కొందరు ఓటర్లకు ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు అవగాహణ కల్పించినప్పటికీ. సమర్పించిన దరఖాస్తుల్లో ఆధారాలు,వివరాల్లో తేడాలు ఉండటంతో తిరిగి వచ్చిన ఫారాలను సరిచేసుకునేందుకు ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది.

### 23వేల నోటీసులు జారీ..

ఖమ్మంరూరల్ మండలంతో పాటు ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలో కలిపి సుమారు 23వేల నోటీసులు జారీ అయినట్లు అధికారులు తెలిపారు. మ్యాపింగ్‌లో తేడాలు, పేర్లలో మార్పులు, ఇతర వివరాల్లో లోపాల కారణంగా కొన్ని దరఖాస్తులు తిరిగి వచ్చినట్లు సంబంధిత ఎన్నికల అధికారులు వెల్లడించారు. గుర్తించిన లోపాలను పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరిస్తామంటున్నారు.

### ఆధారాల కోసం వృద్ధుల అవస్థలు..

సర్‌లో సమర్పించిన ఫారాల్లో లోపాలు ఉన్నట్లు గుర్తించి తిరిగి పంపించడంతో వాటిని సరిచేసుకునేందుకు ఓటర్లు మళ్లీ ప్రక్రియను పూర్తి చేయాల్సి వస్తోంది. ముఖ్యంగా వృద్ధులకు అవసరమైన ధ్రువపత్రాలు సమకూర్చుకోవడం ఇబ్బందిగా మారుతోంది. ధ్రువీకరణ పత్రాల కోసం రెవెన్యూ కార్యాలయాలను ఆశ్రయించాల్సి రావడంతో వృద్ధులు అవస్థలు పడుతున్నట్లు తెలుస్తోంది. ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు ఎక్కడికి వెళ్లాలో తెలీక తీవ్ర అవస్థలు గురవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఓసీలకు మరో సమస్య..

ఓసీ వర్గాలకు కుల ధ్రువీకరణ పత్రం ఉండకపోవడంతో సర్‌లో అవసరమైన ఇతర ఆధారాలను సమర్పించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణ పత్రం అవసరమయ్యే వారికి దానిని పొందేందుకు రెవెన్యూ కార్యాలయంలో కొంత సమయం పడుతోందని స్థానికులు చెబుతున్నారు. దీంతో గడువులోగా అవసరమైన పత్రాలు సమర్పించడంపై ఆందోళన వ్యక్తమౌతుంది. ఒక వైపు ఓటర్ల జాబితాను సక్రమంగా రూపొందించేందుకు సర్ ప్రక్రియ కొనసాగుతుండగా..మరో వైపు దరఖాస్తులు తిరిగి వస్తున్న సందర్భాల్లో ప్రజలకు సరైన మార్గదర్శకత్వం, అవసరమైన పత్రాలపై స్పష్టమైన అవగాహన కల్పించాలని ఓటరులు కోరుతున్నారు.

### ఓటర్లు ఇబ్బందులకు గురవుతున్నారు :
### 28వ వార్డు సిపిఐ కౌన్సిలర్, దండి రంగారావు



సర్ దరఖాస్తులలో ఉన్న సమస్యలతో వెనక్కి వచ్చిన నోటీసులలోని పత్రాలను సమర్పించుకోవడానికి, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. ఓసీలను ఈడబ్యూఎస్ సరిఫికేట్ తెచ్చుకోవాలంటున్నారు. కానీ ఇది రావాలంటే టై పడుతుంది. కావున అధికారులు ప్రత్నమ్మయం చూపాలి.

### అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు :
### తహశీల్దార్, వినయేందర్‌రెడ్డి



అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించడమే సర్ ఉద్దేశం. అందుకు అనుగునంగానే పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. వృద్ధులకు కూడా వెంటనే బిఎల్‌ఓలు ధ్రువీకరణ ద్వారా ఫారంలను తీసుకుంటున్నారు. ఓసీలకు సంబంధించి జిల్లా కలెక్టర్ ఆదేశాలతో చర్యలు తీసుకుంటాను.

# భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ**



**ప్రజాపక్షం/వైరా:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపద్యంలో వైరా మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ సూచించారు. ఈ నెల24,25 తేదీల్లో 200 మిల్లీ లీటర్లకు పైగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించిన నేపద్యంలో ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరారు. భారీ వర్షాల సమయంలో అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని ఆమె సూచించారు. ముఖ్యంగా విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ల సమీపానికి వెళ్లవద్దని, వర్షపు నీరు నిలిచిన ప్రాంతాల్లో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని ఏదైనా వార్డులో వర్షాల కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటే వెంటనే మున్సిపల్ కార్యాలయానికి సమాచారం అందించాలని చైర్‌పర్సన్ కోరారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# వాట్సప్‌లో మెసేజ్.. స్పందించిన చైర్ పర్సన్

**-29వ వార్డు శ్రీరామ్‌నగర్‌లో నీటి నిల్వ సమస్యపై తక్షణ చర్యలు**
**-చైర్‌పర్సన్ స్పందనకు కాలనీవాసుల కృతజ్ఞతలు**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీ 29వ వార్డు పరిధిలోని శ్రీరామ్ నగర్ కాలనీ రోడ్ నెంబర్ 13లో భారీగా వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని కాలనీవాసులు వాట్సాప్ ద్వారా చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత దృష్టికి తీసుకెళ్లారు దీనిపై వెంటనే స్పందించిన చైర్‌పర్సన్, వార్డు కౌన్సిలర్ వెంపటి ఉమా వెంకటేశ్వర్లుతో కలసి క్షేత్రస్థాయికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మున్సిపల్ సిబ్బందితో కలిసి రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిని, ప్రజల రాకపోకలకు ఎదురవుతున్న ఇబ్బందులును పరిశీలించారు. నీటి నిల్వకు గల కారణాలను గుర్తించి, వర్షపు నీరు సులభంగా వెళ్లేలా అవసరమైన చర్యలు చేపట్టాలని మున్సిల్ సిబ్బందికి సూచించారు. వర్షాల సమయంలో నీటి నిల్వ సమస్య తలెత్తకుండా సంబంధిత ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడంతో పాటు తన దృష్టికి తీసుకొస్తే సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు



తీసుకుంటామని చైర్‌పర్సన్ అని పేర్కొన్నారు. సమస్యను వాట్సప్ ద్వారా తెలియజేసిన వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలించినందుకు కాలనీవాసులు చైర్‌పర్సన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బానోత్ దివ్య, బుర్ర మహేష్, బానోత్ ప్రసాద్, మున్సిపల్ సిబ్బంది, శ్రీరామ్‌నగర్ కాలనీవాసులు వసీం, అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో విస్తృత నిర్ధారణ సేవలు



**ప్రజాపక్షం/ ఖమ్మం వైద్య విభాగం :** ఖమ్మం ప్రభుత్వ వైద్యకళాశాల, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పాథాలజీ విభాగం ద్వారా రోగులకు సకాలంలో నిర్ధారణ సేవలు అందుతున్నాయి. 2026లో ఇప్పటి వరకు 1.78లక్షలకు పైగా పరీక్షలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. హీమటాలజీ, క్లీనికల్ పాథాలజీ, సైటో పాథాలజీ, హిస్టో పాథాలజీ విభాగాల్లో వివిధ పరీక్షలు నిర్వహిస్తున్నారు. కాన్సర్ ముందస్తు గుర్తింపులో భాగంగా ఎఫ్ఎన్ఏసి, పాప్ స్మియర్, ఫ్లూయిడ్ సైటాలజీ పరీక్షలు, బయాప్సీ పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. పిల్లలు, యువతలో తలసేమియా, సికిల్ సెల్ వంటి హీమోగ్లోబినోపతీలను గుర్తించేందుకు అవసరమైన పరీక్షలు కూడా నిర్వహిస్తున్నారు. జిల్లా కలెక్టర్ దివాకర్‌టిఎస్ పర్యవేక్షణలో ప్రభుత్వ వైద్య సేవలను మరింత బలోపేతం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# పార్టీ ఫిరాయింపులకు సుప్రీంకోర్టు తీర్పు గుణపాఠం : సిద్ధినేని



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** పార్టీ ఫిరాయింపుల అంశంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హతపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజకీయ పార్టీలకు గుణపాఠంగా నిలుస్తుందని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు సిద్ధినేని కర్ణకుమార్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్ అనంతరం కాంగ్రెస్‌లోకి పార్టీ ఫిరాయించిన వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన అనర్హత తీర్పును సమర్థించారు. దీనిపై అత్యున్నతమైన న్యాయస్థానంపై దానం నాగేందర్ వెళ్లినప్పటికీ అక్కడ కూడా ప్రజాస్వామ్య బద్ధమైన తీర్పురావడం హర్షించదగిన విషయంగా అభివర్ణించారు. కావున పార్టీ మార్పులు, ప్రజాప్రతనిధులు అనర్హతకు సంబంధించిన రాజ్యాంగ నిబంధనలను రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు గౌరవించాలని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ సహా అన్ని రాజకీయ పార్టీలకు ఈ తీర్పు ఒక హెచ్చరికగా భావించాలని అన్నారు. ప్రజల తీర్పుతో ఎన్నికైన ప్రజాప్రతినిధులు పార్టీ మార్పుల విషయంలో రాజ్యాంగబద్ధమైన నిబంధనలను పాటించాల్సిన అవసరం ఉందన్నారు.

# ప్రజల అవసరాల కోసం వినియోగించుకోవాలి





**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలో అకాల వర్షాలతో పలు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోతున్న నేపద్యంలో 7వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ ఫణితి సైదులు తన సొంత జేసిబిని ప్రజల అవసరాలకు ఉచితంగా వినియోగించేందుకు ముందుకు వచ్చారు. వార్డులో వర్షపు నీరు నిలిచిన ప్రాంతాల్లో నీటిని తరలించేందుకు, అత్యవసర పారిశుధ్య పనులకు జేసిబి అవసరమైన ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానికులు తనను సంప్రదించి వినియోగించుకోవచ్చని ఆయన తెలిపారు. అకాల వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచే పరిస్థితులు ఏర్పడుతున్న నేపద్యంలో ప్రజలకు ఇబ్బందులకు కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాసేవే లక్ష్యంగా తన జేసిబిని ఉచితంగా అందుబాటులో ఉంచుతున్నట్లు కౌన్సిలర్ ఫణితి సైదులు పేర్కొన్నారు. 20వ వార్డులలో ఎక్కడైనా వర్షపు నీరు నిలిచి ఇబ్బందులు ఎదురైతే ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు నా జేసిబిని అవసరానికి ఉచితంగా వినియోగించుకోవచ్చు. వర్షాల సమయంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయడమే నా ఉద్దేశ్యం అని సైదులు తెలిపారు.

# అప్రమత్తమైన మున్సిపల్ అధికారులు



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డులలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంపై పురపాలక యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. వర్షాల వలన వార్డుల్లో తలెత్తిన డ్రైనేజీ సమస్యలు, మురుగునీటి ప్రవాహ పరిస్థితిని గురువారం మున్సిపల్ కమీషనర్ రామచంద్రరావు, వైస్ చైర్మన్ కట్ల సంతోష్ క్షేత్రస్థాయిలో పరిశీలించి సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డులలో మురుగునీరు నిలిచిపోకుండా తక్షణ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. స్థానికంగా ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే ఆయా వార్డుల కౌన్సిలర్లకు సమాచారం అందించాలని సూచించారు. మున్సిపల్ సిబ్బంది అంతా ప్రజలకు అందుబాటులో ఉంటారని స్పష్టం చేశారు. మున్సిపల్ సిబ్బంది అంతా ప్రజలకు అందుబాటులో ఉంటారని స్పష్టం చేశారు. ఒకవైపు వినాయక నిమజ్జన కార్యక్రమాలు, మరోవైపు వర్షాల నేపద్యంలో పారిశుద్ధ్య పనుల్లో ఎలాంటి లోపాలు తలెత్తకుండా మున్సిపాలిటీ కార్మికులు అనునిత్యం అందుబాటులో ఉండి విధులు నిర్వర్తిస్తున్నారని కమీషనర్, వైస్ చైర్మన్ వివరించారు. ప్రజలు కూడా పారిశుద్ధ్య నిర్వహణకు సహకరించాలని వారు కోరారు.

# నిరసనకు తరలిన బిఆర్ఎస్ నాయకులు



**ప్రజాపక్షం/వైరా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాద్రి థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం వద్ద బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరంతరంగా విద్యుత్ సరఫరా చేయాలని చేపట్టిన నిరసన కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో కలిసి పాల్గొన్న బిఆర్ఎస్ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జునరావు, వైరా మున్సిపాలిటీ 11వ వార్డు కౌన్సిలర్ దొంతెబోయిన వెంకటేశ్వర్లు, మద్దెల రవి, తిరుపతి శ్రీను, ఏదునూరి శ్రీను పాల్గొన్నారు.

# ఆపదలో అండగా నిలిచిన ఎమ్మెల్యే పాయం



ప్రజాపక్షం/మణుగూరుః ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తూ వైద్య చికిత్సలకు అవసరమైన ఆర్థిక సహాయం అందిస్తున్న పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కి మల్లెలమడుగు గ్రామానికి చెందిన మద్దెల అరవింద్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అశ్వాపురం మండలం మల్లెలమడుగు గ్రామానికి చెందిన మద్దెల అరవింద్‌కు చేతికి సంబంధించిన ఆపరేషన్ అవసరం కాగా, నిజామ్స్ హాస్పిటల్‌లో చికిత్సకు సుమారు రూ.2,20,000 ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. దీంతో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న అరవింద్ కుటుంబానికి సహాయం అందించాలని అశ్వాపురం మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చెంచల రాము ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లారు. విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వెంటనే స్పందించి, ముఖ్యమంత్రి సహాయనిధి (ఎల్‌ఓసీ) ద్వారా రూ.2,20,000 ఆర్థిక సహాయం మంజూరు చేయించేందుకు కృషి చేశారు. దీంతో అరవింద్‌కు అవసరమైన ఆపరేషన్ విజయవంతంగా పూర్తయింది. ఆపరేషన్ విజయవంతం కావడంతో సంతోషించిన అరవింద్ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తన వైద్య చికిత్సకు ఆర్థికంగా అండగా నిలిచి, ఆపరేషన్‌కు అవసరమైన సహాయం అందేలా కృషి చేసిన ఎమ్మెల్యే కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా అరవింద్ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ఆపద సమయంలో స్పందించి వైద్య చికిత్సకు అవసరమైన సహాయం అందించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సేవాభావాన్ని అభినందించారు. పేద, నిరుపేద కుటుంబాలకు వైద్య సహాయం అందేలా ఎమ్మెల్యే చేస్తున్న కృషి ఎంతో భరోసానిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాడిశెట్టి ఖాదర్, మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిరినాకి నవీన్, నాయకులు కోడి అశోక్, భూపాలపట్నం సర్పంచ్ భవతి, తదితరులు పాల్గొన్నారు.

# పినపాక నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే పాయం ప్రత్యేక కృతజ్ఞతలు



ప్రజాపక్షం/కరకగూడెంః మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమానికి విశేష స్పందన లభించి, కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, ప్రజలు మరియు కార్యక్రమంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు. మంత్రుల పర్యటనను విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ చూపిన సహకారం, సమన్వయం, అంకితభావం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ముఖ్యంగా కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేసిన రైతులు, ప్రజలకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా రైతులకు సాగునీటి ప్రయోజనాలు అందడంతో పాటు, పినపాక నియోజకవర్గంలో వ్యవసాయ రంగానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్యే మరోసారి ప్రత్యేక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు.

# వరదలకు కొట్టుకుపోయిన రాజుపేట వంతెన

**-రూ 10కోట్లతో నూతన హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలి: సీపీఐ డిమాండ్**



ప్రజాపక్షం/ములకలపల్లి: మండలంలోని రాజుపేట వద్ద వరదలకు కొట్టుకుపోయిన వంతెనను ఆర్అండ్‌బీ ఎస్ఈ లాల్‌సింగ్, ఈఈ శంకర్, డీఈ విశ్వనాథం, ప్రకాశ్ తదితరులు గురువారం పరిశీలించారు. స్థానికులు, సీపీఐ నాయకులు ప్రజలు ఎదుర్కొంటున్న రవాణా ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దమ్మపేట, ములకలపల్లి, పాల్వంచ మార్గంలో రాకపోకలకు కంపగూడెం, గొల్లగూడెం మీదుగా, అలాగే జగన్నాథపురం, కమలాపురం, మాదారం వైపు తాత్కాలిక డైవర్షన్లు ఏర్పాటు చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు నరాటి ప్రసాద్ కోరారు. సైడ్ బర్మ్స్, వైండింగ్ పనులకు నిధులు మంజూరు చేయాలని, రాజుపేట వద్ద రూ 10కోట్లతో ఆధునిక హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేశారు. వంతెనకు అడ్డంగా ఉన్న చెట్లు, మొద్దులను తొలగించాలని, పైభాగంలోని చెక్‌డ్యామ్ ప్రభావంతో పునాదుల వద్ద ఇసుక కొట్టుకుపోతున్న అంశంపై సాంకేతిక నిపుణులతో సమగ్ర పరిశీలన చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి పైడి వెంకటేశ్వర్లు, కొయ్యల అచ్చుతారావు, శనగపాటి రవి, సీతారాములు, పుష్పాల చందర్‌రావు, నరాటి రమేష్, అనుముల సాయి, ఉప సర్పంచ్ పి లలితారావు, వార్డు సభ్యులు వీరు, లలిత, వెంకటమ్మ, వీరమ్మ, బైరు సాయి, తదితరులు పాల్గొన్నారు.

# సాయిబాబా ఆలయానికి రూ 3.5లక్షల రథం బహూకరణ



ప్రజాపక్షం/బూర్గంపాడు: మండల పరిధిలోని సారపాకలోని షిరిడి పుష్కర ద్వారక సాయిబాబా ఆలయానికి ఇరవెండి తాళ్లూరి పంచాక్షరయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 3.5లక్షల విలువైన రథాన్ని బహుకరించారు. ట్రస్ట్ ఛైర్మన్ తాళ్లూరి పంచాక్షరయ్య, డైరెక్టర్ వల్లూరిపల్లి వంశీకృష్ణ, విజయరేణుక దంపతులు గురువారం ఆలయాన్ని దర్శించి రథాన్ని ఆలయ కమిటీ బాధ్యులకు అందజేశారు. తమ కుమారుడు, తాజా మాజీ అధ్యక్షుడు తాళ్లూరి జయశేఖర్, నీలిమ దంపతుల సౌజన్యంతో రథాన్ని స్వామివారికి అందించినట్లు పంచాక్షరయ్య తెలిపారు. ఈకార్యక్రమంలో సింగమనేని భాస్కరరావు, తీగల జీవన్‌రెడ్డి, ఊటుకూరి రమణమూర్తి, అక్కెర భాస్కరాచారి, కొత్తపల్లి సత్యనారాయణ, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కుంకుమ పూజ



ప్రజాపక్షం/బూర్గంపాడు: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తాళ్లగొమ్మూరు గ్రామ పంచాయితీ మహాలక్ష్మమ్మ కాలనీలోని వినాయక మండపం వద్ద టీమ్ త్రిశూల్ యూత్ ఆధ్వర్యంలో గురువారం మహిళా భక్తులతో కుంకుమ పూజ ఘనంగా నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి శ్రీవరసిద్ధి వినాయక స్వామివారికి కుంకుమార్చనలు సమర్పించారు. ఈకార్యక్రమంలో మండపం ఆధ్మాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. కుటుంబాల్లో ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శాంతి, సమృద్ధి కలగాలని భక్తులు ఆకాంక్షించారు.

# వాస్తవ అవసరాలతోనే గ్రామాల సమగ్రాభివృద్ధి

**- జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విద్యాచందన**




ప్రజాపక్షం/చుంచుపల్లిః గ్రామ పంచాయతీల వాస్తవ అవసరాలు, స్థానిక వనరులను గుర్తించి పక్కా ప్రణాళికలతో అభివృద్ధి పనులు చేపట్టినప్పడే గ్రామాల సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (డీఆర్‌డీఓ) విద్యా చందన అన్నారు. గురువారం ఎన్.కె.నగర్ కమ్మ సత్రంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందికి వీబీ జీ రామ్ జీ (వికసిత్ భారత్ గ్రామ పంచాయతీ ప్రణాళికలు (VGPPs)పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ విద్యాచందన మాట్లాడుతూ 'వికసిత్ భారత్ @2047' లక్ష్యానికి అనుగుణంగా గ్రామాల సమగ్రాభివృద్ధికి పంచాయతీ స్థాయిలో ముందస్తుగా పక్కా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. గతంలో 317 రకాల పనులకు అవకాశం ఉండగా ప్రస్తుతం వాటి సంఖ్య 375కు పెరిగిందని తెలిపారు. అదేవిధంగా ఉపాధి హామీ పనిదినాలను 100 రోజుల నుంచి 125 రోజులకు పెంచినట్లు వివరించారు. అక్టోబర్ 2 నుంచి 2027 జూన వరకు చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ముందుగానే గుర్తించి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. నీటి భద్రత, గ్రామీణ మౌలిక వసతులు, జీవనోపాధికి ప్రాధాన్యం ఇవ్వాలని, గ్రామసభలు, వార్డు సభల ద్వారా ప్రజల భాగస్వామ్యంతో అవసరాల ఆధారిత ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ అవగాహన సదస్సులో డీఆర్‌డీఓ, సీఈఓ, అడదిషనల్ సీఈఓ, అడిషనల్ పీడీ (ఏపీఎస్), ఎంపీడీఓలు పాల్గొన్నారు. చుంచుపల్లి, సుజాతనగర్, లక్ష్మీదేవిపల్లి, జూలూరుపాడు మండలాలకు చెందిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, క్షేత్రస్థాయి సిబ్బంది హాజరయ్యారు.

# పాలేరు రెతులకు నీటి భరోసా



ప్రజాపక్షం/కూసుమంచి: పాలేరు నియోజకవర్గ రైతుల పంటలను కాపాడేందుకు సాగునీరు విడుదల చేసిన రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డికి కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ జిల్లా నాయకుడు జొన్నలగడ్డ రవికుమార్, కూసుమంచి మండలమాజీ ఎంపీపీ జూకూరి గోపాలరావు హైదరాబాద్‌లో మంత్రిని, ఎంపీని కలిసి పాలేరు రైతుల తరపున ధన్యవాదాలు తెలిపారు. రైతుల పంటలకు నీటి కొరత ఏర్పడిన సమయంలో పాలేరు పాత కాల్వకు నీటిని విడుదల చేయడంతో పాటు భక్త రామదాసు ప్రాజెక్టు ద్వారా కూసుమంచి మండలంలోని వివిధ గ్రామాల చెరువులకు నీరు అందించడంతో పంటలను కాపాడేందుకు ప్రయోజనం కలిగిందని వారు పేర్కొన్నారు.

# అగ్రిమెంట్లను వెంటనే అమలు చేయాలి

**- ఏఐటీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య**



ప్రజాపక్షం/చుంచుపల్లిః ఆర్ఎల్‌సీ సమక్షంలో ఏఐటీయూసీతో సింగరేణి యాజమాన్యం కుదుర్చుకున్న 24 అగ్రిమెంట్లను వెంటనే అమలు చేయాలని ఏఐటీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో సింగరేణికి వచ్చిన వాస్తవ లాభాలను పారదర్శకంగా ప్రకటించి, అందులో కార్మికులకు 40 శాతం వాటా ఇవ్వాలని కోరారు. మైనింగ్ స్టాఫ్ ప్రమోషన్ పాలసీని పరిష్కరించి అర్హత, సీనియారిటీ ఆధారంగా ప్రమోషన్లు కల్పించాలని, కార్మికుల రక్షణకు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి ఏరియాలో నెలకు ఒకసారి 'డయల్ టు జీఎం' నిర్వహించాలని, అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికుల కోసం నెలకు రెండుసార్లు మెడికల్ బోర్డు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కొత్త బొగ్గు బ్లాకులను ప్రైవేటీకరించకుండా సింగరేణి కార్మికులతోనే బొగ్గు వెలికితీయాలని, సంస్థ విస్తరణతో ఉపాధి అవకాశాలు పెంచాలని కోరారు. గ్యాసిపికేషన్‌కు అనుకూలంమైన గనులపై శాస్త్రీయ అధ్యయనం చేయాలని, స్ట్రక్చర్ కమిటీ సమావేశం నిర్వహించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని రంగయ్య కోరారు. అగ్రిమెంట్ల అమలులో జాప్యం చేయకుండా కార్మికుల హక్కులు, రక్షణ, సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు.

# నిండు కుండల్లా చెరువులు, కుంటలు

ప్రజాపక్షం/ములకలపల్లి: తుఫాన్ ప్రభావంతో మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రధాన చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. మండలంలోని మూకమామిడి ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నీటితో నిండటంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# కిన్నెరసానికి భారీగా వరద



ప్రజాపక్షం/పాల్వంచ : బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం ఆర్నాబ్ తుఫాన్‌తో ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న వర్షాలకు కిన్నెరసాని ప్రాజెక్టులోకి భారీగా వస్తున్న వరద నీటితో నిండుకుండను తలపిస్తున్నది. ఇన్‌ఫ్లో 1400 క్యూసెక్కులు. జలాశయం పూర్తి సామర్థ్యం 407 అడుగులకు గాను ప్రస్తుతం 40405.60 అడుగులకు చేరింది. వరద ఉధృతిని బట్టి ఏ సమయంలోనైనా ప్రాజెక్టు గేట్లను ఎత్తటానికి ఆస్కారం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డ్యాం సైట్ అధికారులు తెలిపారు.

# మారెళ్లపాడు బ్లాస్టింగ్‌పై డీఈ, ఈఈల బాధ్యత ఎక్కడ?



**పజాపక్షం/అశ్వాపురం:** సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగమైన మారెళ్ల పాడు ఎత్తిపోతల పథకం పైప్‌లైన్ నిర్మాణ పనుల్లో రాతి ప్రాంతాల్లో బ్లాస్టింగ్ జరిగినట్లు వస్తున్న సమాచారంతో ఇప్పుడు సంబంధిత ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా రైల్వే ట్రాక్‌కు సమీపంలో పనులు జరిగిన నేపథ్యంలో బ్లాస్టింగ్‌కు ముందు అవసరమైన అనుమతులు, భద్రతా చర్యలు, రైల్వే శాఖతో సమన్వయం జరిగిందా? అన్నది తేలాల్సి ఉంది.

### బ్లాస్టింగ్ జరిగితే నిబంధనలు పాటించారా.?

ఎక్స్‌ప్లోసిస్ 2008 ప్రకారం గనుల పరిధికి వెలుపల బ్లాస్టింగ్ నిర్వహించే వ్యక్తి చెల్లుబాటు అయ్యే షార్ట్ ఫైరర్ సర్టిఫికెట్ కలిగి ఉండాలి. పేలుడు పదార్థాల విని యోగంలో అవసరమైన అనుమతులు, భద్రతా చర్యలు పాటించాల్సి ఉంటుంది.

### మారెళ్లపాడు పనుల్లో బ్లాస్టింగ్ జరిగి ఉంటే

షాట్ ఫైరర్ ఎవరు, ఆయనకు చెల్లుబాటు అయ్యే సర్టిఫికెట్ ఉందా పేలుడు పదార్థాల వినియోగానికి అవసరమైన లైసెన్సులు ఉన్నాయా, పేలుడు పదార్థాలను ఎక్కడి నుంచి తీసుకొచ్చారు. వాటి నిల్వ, రవాణా నిబంధనలు పాటించారా ?అనే ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సి ఉంది.

### డీఈ, ఈఈలకు తెలియకుండానే బ్లాస్టింగ్ జరిగిందా...

ప్రభుత్వ ప్రాజెక్టులో పైప్‌లైన్ పనులు జరుగుతున్నప్పుడు సంబంధిత సాంకేతిక అధికారులు పనుల పురోగతితో పాటు నాణ్యత, కొలతలు, భద్రతా అంశాలను పర్యవేక్షించాల్సిన బాధ్యత కలిగి ఉంటారు. అయితే బ్లాస్టింగ్ అవసరమయ్యే పరిస్థితి ముందే తెలిసి ఉంటే డీఈ, ఈఈలు బ్లాస్టింగ్‌కు సంబంధించిన భద్రతా ప్రణాళికను పరిశీలించారా, గుత్తేదారుకు అవసరమైన అనుముతులు ఉన్నాయా అని ధృవీకరించారా, షాట్ ఫైరర్ సర్టిఫికెట్ పరిశీలించారా, బ్లాస్టింగ్ జరిగిన ప్రదేశాన్ని స్వయంగా తనిఖీ చేశారా, లేక గుత్తేదారు స్థాయిలోనే బ్లాస్టింగ్



ప్రక్రియ జరిగిందా అన్నది ఇప్పుడు కీలక ప్రశ్నగా మారింది.

### రైల్వే ట్రాక్‌కు దగ్గరైతే మరింత జాగ్రత్త అవసరం

భారతీయ రైల్వే వర్క్స్ మాన్యువల్‌లో రన్నింగ్ రైల్వే లైన్‌కు ఒక పరిధి ఉంటుంది. ఆ పరిధిలో బ్లాస్టింగ్‌ను సాధారణంగా బ్లాక్ ప్రొటెక్షన్ కింద నిర్వహించాలని పేర్కొంది. బ్లాస్టింగ్ ప్రాంతానికి ఆ పరిధిలో ఉన్న ట్రాక్‌కు ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకోవాలని కూడా పేర్కొంది. అందువల్ల మారెళ్లపాడు పనుల్లో ట్రాక్‌కు సమీపంలో బ్లాస్టింగ్ జరిగాయి వారికి సంబంధించిన నిర్దిష్ట ప్రాంతం లోనే రైల్వే లైన్‌ను చెదరగొట్టి అక్కడ మట్టిని తవ్వి పోయడం జరిగింది. ఈ విషయమై రైల్వే అధికారులకు ముందస్తు సమాచారం ఇచ్చారా అవసరమైన బ్లాక్ ప్రొటెక్షన్ తీసుకున్నారా, ట్రాక్‌కు వాస్తవ దూరాన్ని కొలిచి నమోదు చేశారా, రైల్వే సిబ్బందితో సమన్వయం చేశారా, రైళ్ల రాకపోకలను దృష్టిలో పెట్టుకుని బ్లాస్టింగ్ సమయాన్ని నిర్ణయించారా అనే అంశాలను అధికారులు స్పష్టం చేయాల్సి ఉంది.

### పోలీసులకు సమాచారం ఇచ్చారా...?

బ్లాస్టింగ్‌కు సంబంధించిన ప్రధాన సాంకేతిక అనుమతులు ఎక్స్‌ప్లోసివ్స్ రూల్ పరిధిలో ఉన్నప్పటికీ, ప్రజల భద్రత, స్థానిక శాంతిభద్రతలు, రవాణా నియంత్రణ వంటి అంశాల్లో సంబంధిత స్థానిక అధికారులతో సమన్వయం కూడా కీలకం. మరి మారెళ్లపాడు పనుల్లో పోలీసులకు ముందస్తు సమాచారం ఇచ్చారా? , ఏదైనా ఎన్‌ఓసి లేదా స్థానిక అనుమతి అవసరమైతే తీసుకున్నారా? బ్లాస్టింగ్ సమయంలో ప్రజల భద్రత కోసం పోలీసులతో సమన్వయం చేశారా, ఈ వివరాలు కూడా అధికారిక రికార్డుల ద్వారా బయటకు రావాల్సి ఉంది.

### బ్లాస్టింగ్ సమయంలో భద్రతా హెచ్చరికలు ఇచ్చారా...

ఎక్స్‌ప్లోసివ్స్ రైల్స్ ప్రకారం బ్లాస్టింగ్ ప్రాంతంలో స్పష్టమైన వార్నింగ్ ప్రొసీడర్,

**-రైల్వే ట్రాక్ సమీపంలో పేలుళ్లు జరిగితే అనుమతులు తీసుకున్నారా?**
**-రైల్వేకు సమాచారం ఇచ్చారా, బ్లాక్ ప్రొటెక్షన్ ఉందా..?**
**-పోలీసులతో సమన్వయం చేశారా?**
**-షాట్ ఫైరర్ అనుమతులు డీఈ, ఈఈలు పరిశీలించారా?**



వార్నింగ్ సైన్స్, అడుబిట్ సిగ్నల్స్ ఉండాలి. బ్లాస్టింగ్‌కు ముందు సంబంధిత వ్యక్తులను సురక్షిత దూరానికి తరలించే చర్యలు కూడా నిబంధనల్లో ఉన్నాయి. మరి మారెళ్లపాడులో బ్లాస్టింగ్ జరిగి ఉంటే ఎలాంటి హెచ్చరికలు ఇచ్చారు?సైట్‌ను ఎలా ఖాళీ చేయించారు? బ్లాస్టింగ్ ప్రాంతాన్ని ఎవరు పర్యవేక్షించారు? అనే ప్రశ్నలకు సమాధానం అవసరం.

### డీఈ, ఈఈల తనిఖీ రికార్డులు బయల పెట్టాలి

మూడు కిలోమీటర్ల పైప్‌లైన్ పనులకు సంబంధించి డీఈ, ఈఈలు నిర్వహించిన సైట్ ఇన్‌స్పెక్షన్ వివరాలు, బ్లాస్టింగ్‌కు సంబంధించిన అనుమతులు, షాట్ ఫైరర్ సర్టిఫికెట్, రైల్వే శాఖతో జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలు, భద్రతా చర్యలకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తే అసలు విషయం స్పష్టమయ్యే అవకాశం ఉంది. బ్లాస్టింగ్ జరిగిందా ఎవరి అనుమతితో జరిగింది. రైల్వేకు సమాచారం ఇచ్చారా, బ్లాక్ ప్రొటెక్షన్ తీసుకున్నారా, పోలీసులతో సమన్వయం చేశారా, డీఈ, ఈఈలు స్వయంగా తనిఖీ చేశారా అన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్న.

### ఉన్నతాధికారుల విచారణకు డిమాండ్

ప్రభుత్వ నిధులతో చేపడుతున్న ప్రతిష్టాత్మక సీతారామ ప్రాజెక్టులో భాగమైన ఈ పనుల్లో రైల్వే ప్రయాణికుల భద్రత కూడా ముడిపడి ఉన్నందున, బ్లాస్టింగ్ జరిగిన ప్రాంతాన్ని సాంకేతిక బృందంతో పరిశీలించి పూర్తి వివరాలను వెలుగులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

---

## భక్తుల భద్రతకు పటిష్ట చర్యలు

**గోదావరి తీరంలో కరకట్ట నిమజ్జం ఏర్పాట్లు పరిశీలించిన ఎస్‌పి, సబ్ కలెక్టర్**



**ప్రజాపక్షం/భద్రాచలం :** గోదావరి తీరంలో జరిగిన గణేష్ నిమజ్జనాల సందర్భంగా భక్తుల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్‌పి రోహిత్ రాజ్, భద్రాచలం సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ తెలిపారు. గురువారం గోదావరి కరకట్ట వద్ద గణేష్ నిమజ్జన ఏర్పాట్లు వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వర్షాకాలం నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగా ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తుల రాకపోకలు, విగ్రహాల తరలింపు సజావుగాసాగేందుకు పోలీసులు బందోబస్తు బారికేడింగ్ ట్రాఫిక్ నియంత్రణ రూట్ డైవర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. బ్రిడ్జిసెంటర్, బస్టాండ్ సెంటర్ అంబేద్కర్ సెంటర్ కూనవరం రోడ్, డిగ్రీ కాలేజీ కరకట్ట మీదుగా నిమజ్జన పాయింట్ వరకు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. వాహనాలను నిర్దేశించిన పార్కు ప్రదేశంలో నిలిపి పోలీసులు సూచించిన ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలని ఎస్పీ కోరారు. శోభాయాత్ర నిర్వాహకులు భద్రతా నిబంధనలుపాటిస్తూ పోలీస్‌లకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## నాయకన్‌గూడెం అండర్‌పాస్ వద్ద నీటి నిల్వ తొలగింపు

**-ప్రజాపక్షం కథనానికి స్పందన**

**ప్రజాపక్షం/కూసుమంచి:** నాయకన్‌గూడెం అండర్‌పాస్ బ్రిడ్జి కింద వర్షపు నీరు నిలిచి వాహనదారులు ఇబ్బందులు పడుతున్న సమస్యపై ప్రజాపక్షంలో ప్రచురితమైన కథనానికి ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు స్పందించారు. సైట్ ఇంజనీర్ కార్తీక్ ఆధ్వర్యంలో జేసీబీతో నిలిచిన నీటిని తొలగించి, నీటి పారుదల సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. భారీ వర్షాలతో బ్రిడ్జి కింద సర్వీస్ రోడ్లు జలమయం కావడంతో రాజుపేట, ఈశ్వర్‌మాదారం, మంగళ్ తండా, రామచంద్రాపురం, తదితర ప్రాంతాల వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనిపై ప్రజాపక్షంలో కథనం ప్రచురితమైన నేపథ్యంలో అధికారులు స్పందించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో వర్షపు నీరు నిలిచిపోకుండా డ్రైనేజీ, నీటి పారుదల వ్యవస్థను పూర్తిస్థాయిలో మెరుగుపరిచి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరారు.

## భీక్యా తండాలో ఘనంగా ఉట్టి కొట్టే వేడుక



**ప్రజాపక్షం/కారేపల్లి:** భీక్యాతండాలో గణేష్ నవరాత్రుల్లో భాగంగా 20ఏళ్లుగా కొనసాగుతున్న ఉట్టి కొట్టే వేడుకను గ్రామ యువకులు, గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. సుమారు మూడు గంటల పాటు సాగిన కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేశారు. అజ్మీర వీరన్న ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొమ్మిది రోజుల పాటు వినాయక మండపం వద్ద ఉత్సవాలు నిర్వహించిన అనంతరం నిమజ్జనానికి ముందు ఉట్టి కొట్టే వేడుక, చివరి రోజు అన్నదానం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని గ్రామస్తులు తెలిపారు. గ్రామ యువత ఐక్యంగా ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమని అజ్మీరా వీరన్న పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ భూక్యా రాజేష్, వాంకుడోత్ బావు సింగ్, రాంకీ, నందియా, లచ్చు నాయక్, కిషోర్, రామకృష్ణ, కిరణ్, రమేష్, చంటి, వంశీ, దేవిలాల్, తరుణ్, పండు, సాయి, రాఘవేంద్ర, రామ్‌చరణ్, జగన్, పవన్, మెట్టు, సురేందర్, సురేష్, హోంబ, ధరావత్ కిరణ్, చిట్టి, అరవింద్, అఖిల్, గణేష్, సంతోష్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితుడి ఆస్తుల జప్తు

**- రూ.21.15 లక్షల విలువైన రెండు కార్లు, బైక్, బ్యాంకుఖాతా సీజ్**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** గంజాయి అక్రమ రవాణా కేసులో నిందుతుడు పల్లపు రఘుకు చెందిన ఆస్తులను జప్తు చేశారు. ఆయనకు చెందిన రెండు కార్లు, మోటార్ సైకిల్, అతని భార్య బ్యాంకు ఖాతాను పోలీసులు జప్తుచేయగా మొత్తం 21.15,907 ఆస్తులుగా పోలీసులు పేర్కొన్నారు. ఏడూళ్లబయ్యారం పోలీస్ స్టేషన్‌లో 2025 ఆగస్టు 28న నమోదైన కేసులో ఆర్థిక దర్యాప్తు చేపట్టి చెన్నై కాంపిటెంట్ అథారిటీ నుంచి ఫ్రిజింగ్ ఆర్డర్ పొందిన అనంతరం కోర్టు ఉత్తర్వుల మేరకు ఈ చర్యలు తీసకున్నట్లు సిఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆస్తులు జప్తు చేసేలా దర్యాప్తు చేసిన సిఐ ఎస్ఐ సిబ్బందిని ఎస్‌పి రోహిత్ రాజ్ అభినందించారు.

## జూనియర్ కెమిస్టుల డిప్యూటేషన్లు నిలిపివేయాలి

**ప్రజాపక్షం/చుంచుపల్లి:** సింగరేణి క్వాలిటీ విభాగంలో జూనియర్ కెమిస్టులకు ఇస్తున్న డిప్యూటేషన్లను వెంటనే నిలిపివేయాలని ఏఐటీయూసీ కొత్తగూడెం ఏరియా బ్రాంచ్ కార్యదర్శి జక్కుల గట్టయ్య డిమాండ్ చేశారు. సింగరేణి వ్యాప్తంగా సుమారు 16 మంది జూనియర్ కెమిస్టులను ఇతర ఏరియాలకు డిప్యుటేషన్‌పై పంపడం సరికాదన్నారు. సరైన విధానాలు పాటించకుండా డిప్యుటేషన్లు ఇవ్వడం వల్ల ఉద్యోగులపై అదనపు పనిభారం పడటంతోపాటు కుటుంబ సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. మహిళా ఉద్యోగుల పరిస్తితులను కూడా పరిగణనలోకి తీసుకవోఆలని కోరారు. డిప్యుటేషన్లపై పారదర్శక విధానం పాటించి, తక్షణమే పునఃసమీక్షించాలని డిమాండ్ చేశారు. డిప్యుటేషన్లు నిలిపివేయకపోతే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని గట్టయ్య హెచ్చరించారు.

## గుండాలలో ఘనంగా వినాయక నిమజ్జనం



**ప్రజాపక్షం/గుండాల:** తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు అందుకున్న గణపయ్యను గుండాల మండల కేంద్రంలో గురువారం భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. శ్రీ సీతారామాలయం వద్ద ప్రతిష్టించిన విగ్రహాన్ని స్థానిక ఊరచెరువులో నిమజ్జనం చేశారు. నిమజ్జనం సందర్భంగా మండల కేంద్రంలో భారీ ఊరేగింపు నిర్వహించి డోలు వాయిద్యాల మధ్య భక్తులు నృత్యాలు చేశారు. రంగులు చల్లుకుంటూ, టపాసులు కాల్చుతూ సందడి చేశారు. గణపయ్య చేతిలోని లడ్డూను చెన్నా రాంబాబు రూ 40వేలకు దక్కించుకున్నారు.

# వర్షపు నీటితో విద్యార్థుల అవస్థలు



**-ప్రభుత్వ వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలి**
**-ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** చిన్నపాటి వర్షానికే వసతి గృహంలోకి నీరు చేరి విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు తెలిపారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి ఖమ్మం నగరంలోని ఎన్నెస్పి క్యాంపులో ఉన్న ప్రభుత్వ సాంఘిక సంక్షేమ (ఎస్సి) బాలుర వసతి గృహం జలమయమై చెరువును తలపిస్తుంది. వసతి గృహంలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ గురువారం ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి వర్షపు నీటిలోనే ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చింతల రమేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బూర మనోజ్ లు మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల హాస్టల్ ఆవరణ మొత్తం నీరు చేరి చెరువును తలపిస్తుందన్నారు. వసతి గృహం చుట్టూ సరైన ప్రహరీ గోడ లేకపోవడంతో బయట నీరంతా హాస్టల్‌లోకి చేరుతుందన్నారు. హాస్టల్ పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉండడంతో విష పురుగులు, దోమలు వ్యాప్తి చెంది విద్యార్థులు అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. వర్షపు నీరు ఆవరణలో ఉండడంతో విద్యార్థులు గదుల నుంచి బయటకు రాలేక భోజనం చేసేందుకు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు తక్షణమే స్పందించి హాస్టల్ ఆవరణలోని నీటిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. పూర్తి స్థాయిలో డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పాటు వసతి గృహానికి కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేయడంతో పాటు భవనానికి మరమ్మతులు చేపట్టాలన్నారు. సమస్యలను తక్షణమే పరిష్కరించక పోతే విద్యార్థులతో కలిసి ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# సర్ పేరుతో ఓట్ల తొలగింపు

**-కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కేంద్ర ఎన్నికల సంఘం సర్ (స్పెషల్ ఇంటెన్సీవ్ రీవిజన్) పేరుతో దేశ వ్యాప్తంగా ప్రతిపక్ష పార్టీల ఓట్లను లక్ష్యంగా చేసుకుని తొలగిస్తుందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఆరోపించారు. గురువారం నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ తాజాగా సుప్రీం కోర్టులో వేసిన అఫిడవిట్ పూర్తిగా అసమంజసంగా ఉందన్నారు. అనుమానాలను స్వీకరించం, ఆ అంశాన్ని కమిషన్ పరిశీలిస్తుందని క్యాబినెట్ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లామని చెప్పడం సిగ్గు చేటన్నారు. పదేళ్లలో 14 సార్లు ఇద్దరు ఎన్నికల కమిషనర్లు ఇలా చట్టవిరుద్ధంగా చర్యలు చేపట్టారని విమర్శించారు. 2025 జూన్ నుండి ఇప్పటి వరకు సర్‌లో భాగంగా 30 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 13 కోట్లకు పైగా ఓట్లను తొలగించారని ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనన్నారు. ఈసి తీరుపై దేశ వ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తమవుతుందని అందుకే ఢిల్లీలో యువజన కాంగ్రెస్ కార్యకర్తలు సిఈసి జ్ఞానేష్‌కుమార్‌కు వ్యతిరేకంగా నిరసన తెలిపారన్నారు. ఈసి బిజెపి తొత్తుగా మారి ఓట్ల చోరీకి పాల్పడుతూ దేశ ద్రోహ చర్యలకు పాల్పడుతుందన్నారు. బీహార్, మహారాష్ట్ర, తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లో ఎన్నికలను రద్దు చేసి మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని కోరారు. సిఈసి జ్ఞానేష్‌కుమార్ వెంటనే రాజీనామా చేయాలని కోరారు.

# పోలీస్ పెట్రోలింగ్ వాహనాన్ని ఢీకొట్టిన లారీ



**- ఎస్సై, డ్రైవర్‌కు తీవ్ర గాయాలు**
**- ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించిన పోలీస్ కమిషనర్ సునీల్‌దత్**
**- తిరుమలాయపాలెం గ్రామశివారులో అర్ధరాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం**

**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** విధులు నిర్వహిస్తున్న పోలీస్ వాహనాన్ని ఒక లారీ బలంగా ఢీకొట్టిన ఘోర రోడ్డు ప్రమాదంలో సబ్ ఇన్స్‌పెక్టర్(ఎస్సై), డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన బుధవారం అర్ధరాత్రి తిరుమలాయపాలెం గ్రామశివారులోని భవాని హోటల్ సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు ప్రాథమిక విచారణ ప్రకారం... పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు నుండి ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌కు చేపల లోడ్‌తో వెళ్తున్న లారీ (ఏపి16 టిహెచ్6179)తిరుమలాయపాలెం గ్రామ శివారుకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న పోలీస్ పెట్రోలింగ్ వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. లారీ డ్రైవర్ షేక్.రసూల్ (65) వాహనాన్ని అత్యంత వేగంగా అజాగ్రత్తగా నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.

**క్షతగాత్రులకు తక్షణ వైద్యం...**

ప్రమాద సమాచారం అందిన వెంటనే పోలీస్ ఉన్నతాధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన తిరుమలాయపాలెం ఎస్సై కూచిపూడి జగదీష్, వాహన డ్రైవర్ కొత్తపల్లి రాకేష్‌లను తక్షణమే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఎస్సై జగదీష్ పరిస్థితి నిలకడగా ఉండగా తీవ్రంగా గాయపడిన డ్రైవర్ రాకేష్‌కు మెరుగైన వైద్యం అందించడం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

**పరామర్శించిన సిపి..**

ప్రమాద విషయం తెలుసుకున్న పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ బుధవారం రాత్రి ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందేలా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం డ్రైవర్ రాకేష్ కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు. విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది ప్రమాదానికి గురికావడం పట్ల సిపి తీవ్ర విచారం వ్యక్తంచేస్తూ వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. లారీ డ్రైవర్‌పై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకునేందుకు వివరాలు సేకరిస్తున్నారు. ఈ ప్రమాదానికి కారణం లారీ డ్రైవర్ తప్పిదమా లేక పోలీస్ పెట్రోలింగ్ వాహనాన్ని నడిపిన ప్రైవేట్ డ్రైవర్ కాకరవాయి గ్రామానికి చెందిన రాకేష్ తప్పిదమా అనేది తెలియాల్సి ఉంది.

# చెత్త సేకరణ ప్రైవేటు టెండర్ రద్దు చేయాలి



**ప్రజాపక్షం/ఇల్లందు:** పట్టణంలో చెత్త సేకరణ, రిక్షా పుల్లర్ల నిర్వహణను ప్రైవేటు ఏజెన్సీకి అప్పగిస్తూ వేసిన టెండర్‌ను రద్దు చేయాలని సీపీఎం నాయకత్వం డిమాండ్ చేసింది. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ సందీప్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో 24 వార్డులకు 24 టాటా మ్యాజిక్ వాహనాలు, రిక్షా కార్మికుల ద్వారా చెత్త సేకరణ జరిగేదని, ప్రస్తుతం శ్రీలక్ష్మీ జ్యోతి ఎంటర్ ప్రైజెస్‌కు నిర్వహణ అప్పగించడం వల్ల ప్రజలపై ఆర్థిక భారం పడే అవకాశం ఉందని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. రిక్షా పుల్లర్ల వేతనాలను మున్సిపాలిటీనే చెల్లించాలని, పాత విధానంలో చెత్త సేకరణ కొనసాగించాలని కోరారు. నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సీపీఎం నాయకులు అబ్దుల్ నబీ, మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ కుమార్, మన్యం మోహన్‌రావు, షేక్ ఖాదర్, తదితరులు పాల్గొన్నారు.

# పలు కుటుంబాలను పరామర్శించిన పువ్వాడ



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** ఇటీవల మృతిచెందిన పలు కుటుంబాలను మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పరామర్శించారు. గురువారం మండల పరిధిలోని కెవి బంజర గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు భూక్యా బాబులాల్ తండ్రి బాలు ఇటీవల మృతిచెందారు. వారి దశ దిన కర్మకు పువ్వాడ అజయ్‌కుమార్ హాజరై వారి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. పంగిడి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు రామోజీ రవి మాతృమూర్తి సుభద్రమ్మ ఇటీవల మృతిచెందగా ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి అజయ్‌కుమార్ నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. కారేపల్లి మండలం విశ్వనాథపల్లి గ్రామానికి చెందిన ఆర్టిఏ మాజీ మెంబర్, బిఆర్ఎస్ నాయకులు వల్లభనేని రామారావు తండ్రి గురవయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విశ్వనాథపల్లిలో వారి స్వగృహంకు వెళ్లి గురవయ్య చిత్ర పటానికి పువ్వాడ అజయ్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. గురవయ్య ఆత్మకు శాంతి చేకూరాలని దేవున్ని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కూరాకుల వలరాజు, ముత్యాల సత్యనారాయణ, వీరునాయక్, లక్ష్మణ్ నాయక్, దేవభక్తిని కిషోర్, వెంకయ్య, శ్రీనివాసరావు, సురేష్, వీరేందర్, రమేష్ పాల్గొన్నారు.


# భక్తిశ్రద్ధలతో శ్రీశక్తి గణపతి అన్నదానం





**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో శ్రీశక్తి గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని టిపిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, మున్సిపల్ కమీషనర్ రామచంద్రరావు, ఎస్సై పుష్పాల రామారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్‌లు ప్రారంభించారు. అంతకముందు శ్రీశక్తి గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులకు ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై పుష్పాల రామారావు, మున్సిపల్ కమీషనర్ రామచంద్రరావులను ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కట్ల నాగరాజు, కాంపౌండ్ శేషగిరి, రేచర్ల నాగేశ్వరరావు, రేచర్ల రామారావు, రేచర్ల సైదులు, చెరుకూరి కిరణ్, పోలూరి సైదులు, ఉత్సవ కమిటీ సభ్యులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# దోస్త్ స్పాట్ అడ్మిషన్లు



**ప్రజాపక్షం/మధిర:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల మధిరలో దోస్త్ 202627 మిగిలి ఉన్న ఖాళీ సీట్ల భర్తీకి సంబంధించి స్పాట్ అడ్మిషన్లు సెప్టెంబర్ 24, 25 తేదీల్లో అలాగే వన్‌టైమ్ స్పెషల్ స్పాట్ అడ్మిషన్లు సెప్టెంబర్ 28,29 తేదీల్లో నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రవీంద్రారెడ్డి గురువారం తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు సంబంధిత తేదీల్లో కళాశాలకు నేరుగా హాజరై ఒరిజినల్ సర్టిఫికెట్లతో ధృవీకరణ చేయించుకోవాలని తెలిపారు. ఒరిజినల్ సర్టిఫికెట్ల ధృవీకరణ లేకుండా స్పాట్ అడ్మిషన్లకు అనుమతించబడదని పేర్కొన్నారు. వన్‌టైమ్ స్పెషల్ స్పాట్ అడ్మిషన్లలో ముందుగా లోకల్ అభ్యర్థులు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని, లోకల్ అభ్యర్థులు అందుబాటులో లేనప్పుడు మిగిలిన సీట్లను నాన్ లోకల్ అభ్యర్థులకు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే ఏదైనా కళాశాలలో అడ్మిషన్ పొందిన అభ్యర్థులు స్పాట్ అడ్మిషన్లకు పరిగణించబడరని స్పష్టం చేశారు. స్పాట్ అడ్మిషన్ల ద్వారా చేరిన అభ్యర్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదని పేర్కొన్నారు.

# రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికలకు 41 నామినేషన్లు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్:** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఖమ్మం జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ ఎన్నికలకు సంబంధించి 41 నామినేషన్లు దాఖలైనట్లు జిల్లా ఎన్నికల అధికారి, ముఖ్య ప్రణాళికాధికారి ఎ. శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నామినేషన్లు స్వీకరించినట్లు తెలిపారు. మొత్తం 41 మంది నామినేషన్లు దాఖలు చేశారన్నారు. సెప్టెంబర్ 25 శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నామినేషన్లను పరిశీలించనున్నట్లు ఆయన తెలిపారు. సెప్టెంబర్ 26 ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉందని, మధ్యాహ్నం మూడు గంటలకు పోటీలో ఉండే అభ్యర్థుల తుదిజాబితాను ప్రకటిస్తామని తెలిపారు. పోలింగ్ అక్టోబర్ నాలుగున ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఖమ్మం నగరంలోని ఇల్లందు క్రాస్ రోడ్డు వద్ద గల టిటిడిసి భవన్‌లో పోలింగ్ జరుగుతుందని ఆయన తెలిపారు.

# కోర్టు తీర్పును సమర్థించిన డాక్టర్ రామనాథం



**ప్రజాపక్షం/మధిర:** కాంగ్రెస్ పార్టీలోకి పిరాయించిన బిఆర్ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ శాసనసభ సభ్యత్వంపై అనర్హత వేటు వేసిన హైకోర్టు తీర్పును సమర్థిస్తూ ఇచ్చిన సుప్రీంకోర్టు పట్ల ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ టిడిపి కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం హర్షం వ్యక్తం చేశారు. ప్రజా ప్రాతినిధ్యం చట్టం ద్వారా ఎన్నికై ప్రజాప్రతినిధిగా గెలిపించిన ఓటరు మహాశయుల తీర్పుకు వ్యతిరేకంగాను, బి ఫారం ఇచ్చిన బిఆర్ఎస్ పార్టీ, ఆ పార్టీ ద్వారా లభించిన శాసనసభ ప్రభుత్వానికి రాజీనామా చేయకుండా కాంగ్రెస్ పార్టీలోనికి పిరాయించడం ఆ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన బిఫామ్‌పై లోకసభ స్థానానికి పోటీ చేయడం చట్ట విరుద్ధం అప్రజాస్వామికం. ఇట్టి పిరాయింపు శాసనసభ పరిధిలో జరిగినా శాసనసభ ఆవల జరిగినా చట్ట విరుద్ధమేనని, పార్టీ పిరాయించి శాసన సభ్యులుగా ఇంకా కొనసాగుచున్న మిగతా వారిపై కూడా అనర్హత వేటు వేయాలన్నారు. చట్టాలు చేసే వారు చట్టాలను కాపాడాల్సిన వారు ఈ పిరాయింపుల అంటు రోగాన్ని అరికట్టడానికి టీకా తయారు చేయించాలని రామనాథం అన్నారు.

# గ్రామాల అభివృద్ధికి పక్కా ప్రణాళికలు రచించాలి

**- మహిళలకు ఉపాధి అవకాశాలు పెంచాలి**
**- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**



**ప్రజాపక్షం/చుంచుపల్లి:** గ్రామాల సమగ్ర అభివృద్ధికి క్షేత్రస్థాయి అవసరాలకు అనుగుణంగా పక్కా ప్రణాళికలు రూపొందించుకోవాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. చుంచుపల్లి మండల పరిధిలోని ఎన్‌కే నగర్ కమ్మ సత్రంలో చుంచుపల్లి, లక్ష్మీ దేవి పల్లి, సుజాతనగర్, జూలూరుపాడు మండలాల పంచాయతీ సర్పంచులు, సెక్రటరీలు, సిబ్బందికి 'విబి జి రామ్‌జి' పథకంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు ఉపాధి, ఆదాయ అవకాశాలు మెరుగుపడే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి కార్యాచరణ చేపట్టాలని సూచించారు. శ్రమతో కూడిన పనులు చేసే కుటుంబాలకు 125 రోజుల పనిదినాలు కల్పించేలా, 375 రకాల అభివృద్ధి పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధానంగా గ్రామాల్లో నీటి భద్రత, మౌలిక వసతులు, స్థిరమైన జీవనోపాధి కల్పన అనే మూడు అంశాలపై ప్రజల భాగస్వామ్యంతో ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా అమలు చేసే ప్రతి కార్యక్రమం అర్హులకు చేరేలా సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ విద్యాచందన, వివిధ మండలాల ఎంపీడీఓలు, ఎంపీవోలు, వివిధ గ్రామాల సర్పంచులు, టెక్నికల్ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోకపోతే అన్నీ బంద్

**జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోకపోతే పంట కొనుగోళ్లు, ఎరువుల విక్రయాలు, రాయితీలు తదితర వ్యవసాయ సేవలు పొందడంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని జిల్లా వ్యవసాయాధికారి దనసరి పుల్లయ్య తెలిపారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్‌కు ఈ నెల 30వ తేదీ వరకు మాత్రమే గడువు ఉన్నందున అర్హులైన రైతులంతా వెంటనే రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని సూచించారు. మండల కేంద్రం లోని రైతు వేదికలో బుధవారం ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో మొత్తం 77,862 మంది రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ అవసరం ఉండగా, ఇప్పటివరకు సుమారు 76 వేల మంది రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోలేదన్నారు. గడువులోగా రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోకపోతే ప్రభుత్వ రాయితీలు, ఇతర వ్యవసాయ సేవలు పొందడంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపారు. జిల్లాలో యూరియాకు ఎలాంటి కొరత లేదని స్పష్టం చేశారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని, పంటలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని తెలిపారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయాధికారి ఎం. రాధ పాల్గొన్నారు.

# వానతో వరికి ఊపిరి..!

**చెరువులు, కుంటల్లోకి చేరుతున్న నీరు..**
**రైతుల్లో పెరిగిన ఆశలు**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** వర్షం కోసం ఎదురుచూస్తున్న వరి రైతులకు ఇటీవల కురుస్తున్న వర్షాలు ఊరటనిస్తున్నాయి. ఎండలతో నీటి కోసం ఇబ్బందులు పడుతున్న పంట పొలాలకు వరుణుడు కరుణించడంతో వరి పంటకు కొత్త జీవం వచ్చినట్లయింది. ఇప్పటికే నాట్లు వేసిన పొలాల్లో పంట ఏపుగా పెరుగుతుండగా.. మరికొన్ని ప్రాంతాల్లో సాగు పనులు ముమ్మరమయ్యాయి. మండలంలోని పలు గ్రామాల్లో వరి సాగు విస్తీర్ణం గణనీయంగా ఉంది. వర్షాలు సకాలంలో కురవడంతో పొలాల్లో నీరు చేరుతోంది. దీంతో బోర్లు, బావులపై ఆధారపడే రైతులకు కొంత ఊరట లభిస్తోంది. చెరువులు, కుంటల్లోకి సైతం వర్షపు నీరు చేరుతుండటంతో రానున్న రోజుల్లో సాగునీటి ఇబ్బందులు తగ్గుతాయని రైతులు ఆశిస్తున్నారు. ప్రస్తుతం వరి పంట ఎదుగుదలకు నీరు ఎంతో అవసరమైన దశలో వర్షాలు కురుస్తుండటంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. అయితే అధికంగా వర్షాలు కురిసి పొలాల్లో నీరు నిలిచిపోతే పంటకు నష్టం వాటిల్లే అవకాశం ఉండటంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. వర్షాలు ఇదే విధంగా కొనసాగితే వరి పంటకు అవసరమైన నీరు అందడంతో దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని రైతులు భావిస్తున్నారు. సాగు పెట్టుబడులు పెరిగిన నేపథ్యంలో పంట చేతికొచ్చే వరకు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండాలని కోరుకుంటున్నారు. వరుణుడి కరుణతో ఈ ఏడాది పంటలు బాగా పండాలని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

# లడ్డూ గెలుచుకున్న గొగ్గల రామక్రిష్ణ స్వర్ణలత దంపతులు



**ప్రజాపక్షం/కరకగూడెం:** కరకగూడెం మండలంలోని అనంతారం గ్రామపంచాయతీ పరిధిలోని కొత్తూరు గ్రామంలో వివేకానంద యూత్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఎంప్లాయిస్ సహకారంతో విఘ్నేశ్వర సంబరాలు, నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. లడ్డు వేలం పాటలో గొగ్గల రామక్రిష్ణ స్వర్ణలత దంపతులు విఘ్నేశ్వర స్వామి వారి లడ్డు రూ. 46,000/ సొంతం చేసుకున్నారు.

# పసునూరి సోమయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం



**ప్రజాపక్షం/కరకగూడెం:** కరకగూడెం మండలం అనంతారం గ్రామంలో రామాలయ సన్నిధిలో వినాయక నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా వినాయక నిమజ్జనం ఆఖరి రోజున పసునూరి సోమయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ ఆశారాణిభాస్కర్ దంపతులు, వారి కుమారులు సందేశ్, రిత్విక్, పసునూరి సోమయ్య సతీమణి సత్తెమ్మ భక్తులకు అన్నప్రసాదం అందించారు. వినాయక నవరాత్రి ఉత్సవాలకు హాజరైన భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ భక్తులకు సేవ చేయడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. అనంతరం, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించిన ఆశారాణి భాస్కర్ దంపతులు, వారి కుటుంబ సభ్యులకు అనంతారం భక్తులు, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ మహత్కార్యాన్ని నిర్వహిస్తున్న కుటుంబానికి భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, సకల సంపదలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని ఆకాంక్షించారు. భక్తి, సేవా భావంతో నిర్వహించిన ఈ అన్నదాన కార్యక్రమం అందరి ప్రశంసలు ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# తుఫాన్ బాధితులను ఆదుకోవాలి



**ప్రజాపక్షం/పాల్వంచ:** ఆర్నాబ్ తుఫానుతో నష్టపోయిన బాధితులను వెంటనే ఆదుకోవాలని సిపిఐ నాయకులు అధికారులను కోరారు. మండల పరిధి దంతెలబోర ఎస్‌సి కాలనీలో బుధవారం రాత్రి బంగాళాఖాతంలో ఏర్పడిన ఆర్నాబ్ తుఫాన్ కారణంగా బలమైన గాలులు వీచటంతో పలువురు పేదల ఇండ్లు, రేకులు ఎగిరిపోయాయి. దీనితో నిత్యావసర సరుకులు తడిసిపోయి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న బాధితులను ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివ రావు ఆదేశాల మేరకు ఎంపిడిఓ రాజారావు, రెవిన్యూ, విద్యుత్ అధికారులతో కలిసి గురువారం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్ రావు మాట్లాడుతూ ఆర్నాబ్ తుఫాన్ వలన నష్టపోయిన ఒక్కో కుటుంబాలకు నిత్యావసరాల కోసం 50 వేయిల చొప్పున పూర్తిగా ఇండ్లు దెబ్బతిన్న వారికి లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సహాయం తక్షణమే అందజేయాలన్నారు. విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి కరెంటు సరఫరాను పునరుద్ధరించి విద్యుత్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు నిమ్మల రాంబాబు, సిపిఐ అనుబంధ రైతు సంఘం మండల నాయకులు కోలేటి రాంబాబు, నారాయణరావుపేట సర్పంచ్ బండ సరస్వతి, ప్రశాంత్, నాయకులు రవి, భాస్కర్, వెంకటేశ్వర్లు, ఆదిలక్ష్మి, తాళ్ళ వెంకటేశ్వర్లు, తులశమ్మ, పంచాయితీ పాలక వర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గెజిటెడ్ ఆఫీసర్స్‌తో చేయుత పై విచారణ



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలం లోని వివిధ గ్రామాలలో చేయుత లబ్ధికి దరఖాస్తులను గెజిటెడ్ అధికారులు క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టారు. మండలం లోని మంగాపురంతండా లో బుధవారం మండల విద్యాశాఖాధికారి బీ, చలపతిరావు విచారణ చేపట్టారు. ఆర్థిక పరిస్థితి, భూమి వాహనాలు తదితర అంశాలను పరిగణలోకి తీసుకుంటున్నారు. పరిశీలన విచారణ వివరాలను ప్రత్యేక యాప్లో నమోదు చేసి కలెక్టర్ లాగిన్ కు పంపిస్తారు. కొత్తకొత్తూరు లో డిప్యూటీ తహశీల్దార్ కనకం నరసింహారావు, ముజ్జుగూడెం లో ఎంపీడీఓ యం.యర్రయ్య, కట్టుకాచారం లో తహశీల్దార్ రాంప్రసాద్ లు క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టారు. ఆన్లైన్ లో ఫించన్ కోసం దరఖాస్తు లకు ప్రత్యేక సాఫ్ట్వేర్ లో అనుసంధానం చేస్తున్నారు. రిమార్కు కాలమ్ లో అభ్యంతరాలను పరిశీలించి వారికి ఫించన్ పొందేందుకు అర్హత ఉందా? లేదా అన్నవిషయం తెలుసుకుంటున్నారు.

# కూలిన వంతెనను పరిశీలించిన మెచ్చా



**ప్రజాపక్షం/ములకలపల్లి:** రాజుపేట వద్ద వంతెన కూలిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిన నేపథ్యంలో అశ్వారావుపేట మాజీ ఎంఎల్ఏ, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మెచ్చా నాగేశ్వరరావు వంతెనను పరిశీలించారు. సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా తక్షణమే ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో నాయకులు మోరంపూడి అప్పారావు, సెనగపాటి సీతారాములు, బండి కొమరయ్య, పుష్పాల చందర్‌రావు, కొండవీటి చంద్రశేఖర్, సునీల్, సున్నం బాబురావు, పుష్పాల హనుమంత్, తాటి ప్రవీణ్, సిద్దెల వెంకటేష్, శేషు, సాయి, సోందు, వెంకటేశ్వర్లు, బొర్రా రవి, తదితరులు పాల్గొన్నారు.

# అజ్మీర రాంబాబుకు నివాళి



**ప్రజాపక్షం/ఇల్లందు:** ఇల్లందు మండలం రొంపేడు గ్రామ పంచాయితీ పరిధిలోని చర్చ్ రొంపేడు గ్రామానికి చెందిన అజ్మీర రాంబాబు అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎంఎల్‌ఏ కోరం కనకయ్య ఆయన నివాసానికి వెళ్లి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబానికి అండగా ఉంటానని, అవసరమైన సమయంలో సహాయం అందిస్తానని భరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షుడు మండల రాము, పట్టణ అధ్యక్షుడు బొల్లా సూర్యం, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కాకాటి భార్గవ్ నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# రైతాంగ సమస్యలపై ఛలో ఖమ్మం



**ప్రజాపక్షం/కారేపల్లి:** రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 28న ఖమ్మంలో నిర్వహించే భారీ బహిరంగ సభ 29,30 తేదీల్లో జరిగే అఖిల భారత రైతు కూలీ సంఘం నాలుగో జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి వై ప్రకాష్ పిలుపునిచ్చారు. సింగరేణి మండలంలోని కారేపల్లి, పేరుపల్లి, సూర్య తండా, మాదారం, మంగలితండా, పోలంపల్లి, భాగ్యనగర్ గ్రామాల్లో ఆటో ప్రచారం, సమావేశాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు కంచర్ల శ్రీనివాస్‌రెడ్డి, కోయల శ్రీనివాస్, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి వై జానకి, బాటయ్య, రాంబాబు, గురవయ్య, బి వీరు, డి రామ్మూర్తి, ఎం వెంకన్న, పుల్లన్న, లక్ష్మి, మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# గెలుపే లక్ష్యంగా పనిచేయండి

**-మిత్ర పక్షాలదే గెలుపు**



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఆర్టిసి కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఎంప్లాయీస్ యూనియన్ కార్యకర్తలు పనిచేయాలని ఆర్టిసి ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పాటి అప్పారావు పిలుపునిచ్చారు. ఆర్టిసి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎంప్లాయీస్ యూనియన్ ఎన్ఎంయు కలిసి పోటీ చేస్తున్నాయని ఆయన స్పష్టం చేశారు. మరి కొన్ని సంఘాలతోనూ పొత్తు కలిసే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఎంప్లాయీస్ యూనియన్ ఖమ్మం రీజియన్ ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం స్థానిక గిరి ప్రసాద్ భవన్‌లో జరిగింది. రీజియన్ కార్యదర్శి పిల్లి రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అప్పారావు మాట్లాడుతూ ప్రతి డిపోలోనూ కార్మికులను కలిసి ఎంప్లాయీస్ యూనియన్ విధానాలను వివరించడంతో పాటు ఆర్టిసి మనుగడ, కార్మికుల డిమాండ్లు ఎంప్లాయీస్ యూనియన్ పోరాడి సాధించిన విజయాలను విస్తృతంగా ప్రచారం చేయాలని అప్పారావు కోరారు. వ్యక్తిగత విమర్శలకు దూరంగా ఉండాలని మిత్ర పక్షాల గెలుపు మాత్రమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్త గుర్తింపు కోసం బస్సు గుర్తుపై ఓటు వేయాలని ఆయా రీజియన్లలో మిత్ర పక్ష యూనియన్లను గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి కె. భాస్కర్, నాయకులు ఎంఆర్‌సిరావు, అరుణకుమారి, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, డిపో అధ్యక్ష, కార్యదర్శులు, ఏఐటియుసి నాయకులు పాల్గొన్నారు.

# చింతగుర్తిలో పొంగిన వాగు

**-రాకపోకలకు తీవ్ర అంతరాయం**



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండల పరిధిలోని చింతగుర్తి గ్రామంలో ఉన్న వాగు పొంగింది. దీనితో అధికారులు ఆ వాగుపై రాకపోకలను నిలిపివేశారు. మండల పరిధిలోని చింతగుర్తి గ్రామ సమీపంలో ఉన్న వాగుపై బ్రిడ్జి శిథిలావస్థకు చేరడంతో ఇటీవల రూ.2.40 కోట్లతో నూతన బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో తాత్కాలికంగా వేసిన రహదారిపై నుంచి వరద నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిపి వేశారు. ఆ రహదారి వెంట ప్రయాణించకుండా ఉండేందుకు ట్రాక్టర్లను అడ్డుగా పెట్టారు. ఆ రహదారి గుండా రాకపోకలు సాగించవద్దని పోలీసులు సూచించారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎల్‌నినో ప్రభావంతో గత 20 రోజులుగా వర్షాలు లేక వేసిన పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. అర్నాబ్ తుఫాన్ ప్రభావం వల్ల కురుస్తున్న వర్షాలతో పంటలకు జీవం పోసినట్లయిందని రైతులు తెలిపారు.

# పంటలను కాపాడిన వర్షం



**ప్రజాపక్షం/పెనుబల్లిః** వరి, పత్తి పంటలను వర్షం కాపాడిందని పెనుబల్లి మండల రైతులు ఆనందం వ్యక్తపరుస్తున్నారు. ముఖ్యంగా రాతోని ఆయకట్టు రైతులు, వర్షం పై ఆధారపడిన ఆకాశవాయి భూముల్లో సాగుచేయనున్న రైతులకు ప్రస్తుతం పడుతున్న వర్షం పంటను కాపాడిందని రైతులు అంటున్నారు. రాతోని ఆయకట్టు భూముల్లో సాగు కు రైతులు ఆందోళన చెందారు. రాతోని లిఫ్ట్ కు చెందిన ట్రాన్స్ఫరం లు చోరికి గురికావటం. మంజూరుకి జాప్యం కావటం తో ఆయకట్టు రైతులు వర్షం పైనే ఆధారపడి వరి సాగు చేశారు. లిఫ్ట్ ఉంటే రాతోని చెరువుకు గోదారి జలాలు అంది రెండు పంటలు పండేవి. దాంతో వరి సాగు చేయాలా వద్దా అని సంధిగ్ధం లో రైతులు ఉండి వర్షం పై అదారపడి వరి సాగు ఆలస్యం అయినా వరి సాగు చేశారు. రైతులు ఆశించిన విధంగానే వర్షం అప్పుడప్పుడు పడి వరి పంటను బతికిస్తుందని రైతులు తెలుపు తున్నారు. వరి సాగు ప్రస్తుతం చిరు పొట్ట దశలో ఉంది. వరి సాగుకు వరి పంట ఉన్న స్థితిలో నీరు ఎక్కువగా పంటకు అవసరం ఉంటుందని ప్రస్తుతం పడిన వర్షం వలన రైతుల్లో ఆశలు చిగురించాయి. ఈ లోపు రాతోని చెరువులు దాతలు ముందుకు వచ్చి అద్దె ట్రాన్స్ఫరం ఏర్పాటు చేశారు. తద్వారా ఎత్తిపోతల ద్వారా చెరువు నింపితే పంటలు చేతికి దక్కుతాయని ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు. రాతోని ఆయకట్టు పరిధిలో గంగాదేవిపాడు, బయ్యన్నగూడెం, రామ చంద్రరావు బంజర, యడ్లబంజర్, గ్రామాల్లో 2500 ఎకరాలు వరి సాగు చేతికి దక్కుతుందని రైతులు ఆనందం వ్యక్తపరుస్తున్నారు. అదేవిధంగా మెరక ప్రాంతాల్లో పత్తి పంటను సాగుచేస్తున్న రైతులకు వర్షం వలన పంట దిగుబడి వస్తుందని పత్తి రైతులు ఆనందం చెందుతున్నారు. ఆకాశ వాయి రైతులకు వర్షం వలన ఉపయోగం జరిగిందని రైతులు సంబరపడుతున్నారు.

# కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి

**-మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** భారీ వర్షాల నేపథ్యంలో ఉమ్మడి ఖమ్మంజిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గురువారం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లతో హైదరాబాద్ నుంచి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చరవాణిలో మాట్లాడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ప్రధాన జలశయాల్లో నీటి మట్టం పరిస్థితి, లోతట్టు ప్రాంతాల పరిస్థితితో పాటు ఇతర అంశాలను అడిగి తెలుసుకున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. మరో రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ప్రధానంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పరిస్థితిని అడిగి తెలుసుకుని వాగులు, వంకలు పొంగిపొర్లే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ అప్రమత్తంగా ఉండాలని మంత్రి తుమ్మల తెలిపారు.

# కెయు గోల్డెన్ జూబ్లీ వేడుకలు

**-పలువురికి సన్మానం**



**ప్రజాపక్షం/ఖమ్మం :** కాకతీయ యూనివర్సిటీ గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో భాగంగా జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో విశిష్ట సేవలు అందించిన వారిని సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఖమ్మం జిల్లా నుండి ప్రొ॥ ఎ. వెంకటేశ్వర్లు, కాకతీయ యూనివర్సిటీ ఉప కులపతి ప్రొ॥ ప్రతాపరెడ్డి, రిజిస్టర్ ప్రొ॥ రామచంద్రం తదితరులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. వీరితో పాలు పలువురిని సన్మానించిన ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి సీతారాం, తెలుగు అకాడమీ ఛైర్మన్ ప్రొ॥ వెంకటనారాయణ పాల్గొన్నారు.

# క్రైస్తవ సమాజ సమస్యలపై పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** మారాయిగూడెంలో పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి భద్రాచలం ఎంఎల్‌ఏ డాక్టర్ తెల్లం వెంకట్రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా పాస్టర్లు ఎంఎల్‌ఏలకు ఆత్మీయ స్వాగతం పలికారు. ప్రార్థనా మందిరాల సమస్యలు, పాస్టర్ల సంక్షేమం, విద్యా, వైద్య సదుపాయాలు, మౌలిక వసతులు, పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై చర్చించారు. ప్రజలందరినీ సమానంగా సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందేలా కృషి చేస్తానని ఎంఎల్‌ఏ తెలిపారు. క్రైస్తవ సమాజ సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముర్రం వీరభద్రం, అపక శ్రీను, ఉబ్బవేణు, సర్పంచ్ కల్లూరి ఆదినారాయణ, పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు సోడివిన్సెంట్ దానియేలు, గంగరాజు, పాస్టర్లు, సేవకులు, క్రైస్తవ సమాజ ప్రతినిధులు పాల్గొన్నారు.

# తల్లాడలో వైభవంగా శ్రీ గణేష్ నిమజ్జన శోభాయాత్ర



**ప్రజాపక్షం/తల్లాడ :** తల్లాడ ఎన్‌టిఆర్ నగర్‌లో చిన్నారులు కుల, మతాలకు అతీతంగా ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జన శోభాయాత్రను గురువారం ఘనంగా నిర్వహించారు. తల్లాడ పట్టణంలో శ్రీకృష్ణ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక నిమజ్జన శోభాయాత్రను భక్తి శ్రద్ధలతో, ఉత్సాహపూరిత వాతావరణంలో అర్థరాత్రి వరకు వైభవంగా కొనసాగింది. గణనాథున్ని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనగా పట్టణ పుర వీధులన్ని గణేష్ నామస్మరణతో మార్మోగాయి. శ్రీ గణేష్ శోభాయాత్రలో భక్తులు, మహిళలు, యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా ముందుకు సాగారు. పాటలు, భక్తి నినాదాలు, సందడితో శోభాయాత్ర అర్థరాత్రి రెండు గంటల వరకు సాగింది. అనంతరం గణనాథున్ని భక్తి శ్రద్ధలతో స్థానిక తల్లాడ చెరువులో నిమజ్జనం చేశారు.

# ఇందిరమ్మ కాలనీ వరద ప్రవాహంపై వైస్ చైర్మన్ కట్ల ప్రత్యేక శ్రద్ధ



**ప్రజాపక్షం/వైరాః** తుఫాన్ నేపద్యంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ ముందస్తు చర్యల్లో భాగంగా కాలనీలో బ్లడ్ ప్రభావం వదర ప్రభావం చూపకుండా ఉండేవిధంగా మున్సిపల్ అధికారులతో మాట్లాడి తానే దగ్గరుండి చర్యలు చేపట్టారు. పైప్‌లైన్ పగిలిపోవడంతో భారీగా నీరు కాలనీలోకి వెళుతున్న విషయం తెలుసుకున్న మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. ఆయన సంబంధిత మున్సిపల్ అధికారులకు సమాచారం అందించారు. తక్షణమే జేసిబిని మున్సిపల్ సిబ్బందిని అక్కడ పిలిపించి మరమ్మత్తు చేయించారు. అనంతరం మున్సిపల్ కమీషనర్ ఇందిరమ్మ కాలనీలో వైస్ చైర్మన్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తుఫాన్ ప్రభావం వలన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చెరుకూరి కిరణ్, ఇందిరమ్మ కాలనీ, ప్రజలు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్, వరంగల్ ఎయిర్ పోర్టుకు సంత్ సేవాలాల్ మహారాజ్ పేరుపెట్టాలి



**ప్రజాపక్షం/తల్లాడ :** ఆదిలాబాద్, వరంగల్ ఎయిర్ పోర్టుకు సంత్ సేవాలాల్ మహారాజ్ పేరు పెట్టాలని దశరత్ నాయక్ డిమాండ్ చేశారు. గురువారం తల్లాడ మండలం రంగంబంజర గ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ ఆదిలాబాద్, వరంగల్ ఎయిర్ పోర్టుకు సంత్ సేవాలాల్ మహారాజ్ పేరును నామకరణం చేయాలని తెలంగాణ రాష్ట్రంలో దాదాపు లంబాడీలు 50 లక్షల మంది ఉన్నారన్నారు. ఈ ప్రభుత్వానికి లంబాడీలు ఓట్లు వేసి గెలిపించారని స్వయాన సిఎం రేవంత్‌రెడ్డి ఒప్పుకున్నారన్నారు. లంబాడీల మీద ప్రేమ, అభిమానం ఉంటే ఆదిలాబాద్, వరంగల్‌లో ఎక్కువగా లంబాడీలు ఉన్న ప్రాంతమైనప్పటికీ ఈ ఎయిర్ పోర్టుకు లంబాడీల ఆరాధ్య దైవమైన శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ పేరుపెట్టి ఆత్మవిశ్వాసాన్ని సిఎం రేవంత్‌రెడ్డి నిరూపించుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

# కుండపోత వర్షాలతో నిండిన చెరువులు



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో చెరువులు, కుంటలు నిండుకుండల్లా మారాయి. చిన్నగుబ్బలిమంగి వాగు అలుగుపడి ఉధృతంగా ప్రవహిస్తోంది. వర్షాలతో పంటలకు తగినంత నీరు అందడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ప్రస్తుతం సుమారు 16వేల ఎకరాల్లో వరి, 20వేల ఎకరాల్లో పత్తి సాగవుతోంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు పంటలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని రైతులు తెలిపారు.